ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 24 నవంబరు 2024

వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో
కడప నుంచి పెండ్లిమర్రి వరకు ఉన్న రైల్వే ట్రాక్‌పై పెరిగిన కంపచెట్లు



ప్రజాధనం దుర్వినియోగానికి నిలువెత్తు నిదర్శనం ఈ కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టు. 2008-09లో ఈ రైల్వే ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదముద్ర తెలిపింది. 2010 సెప్టెంబరు 1వ తేదీన ప్రాజెక్టు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు రూ.317 కోట్లతో పెండ్లిమర్రి వరకు 21.8కి.మీ మేర రైల్వేలైన్ పూర్తయింది. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పెండ్లిమర్రి రైల్వేస్టేషన్ సైతం నిర్మించారు. దాని తర్వాత ఈ ప్రాజెక్టు పనులు ముందుకు కదలడం లేదు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో గత ఐదేళ్లూ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ రైల్వే మార్గం అంతా కంపచెట్లు పెరిగిపోయాయి.

కడప-బెంగళూరు రైల్వేలైన్ కలేనా..?





నిరుపయోగంగా ఉన్న రైల్వే సామాన్లు



వైసీపీ హయాంలో దుస్థితి ఇలా..

- రాయచోటి మీదుగా బెంగళూరుకు..
- నాలుగు దశల్లో పనులకు శ్రీకారం
- రూ.317 కోట్లతో మొదటి దశ పూర్తి
- వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో..
- మిగతా పనులకు బ్రేక్
- ట్రాక్ పొడవునా పెరిగిన కంపచెట్లు

పెండ్లిమర్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప-బెంగళూరు రైల్వేలైన్ దక్షిణ మధ్య రైల్వేలో అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఒకటి. 268 కి.మీ. మేర చేపట్టాలనుకున్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం అప్పట్లో రూ.1784.64 కోట్లు. ఈ రైల్వే లైన్ నిర్మాణం ద్వారా కడప-బెంగళూరు మధ్య దూరం తగ్గుతుంది. ఈ లైను వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లా వాసులకు హైటెక్ నగరమైన బెంగళూరును మరింత చేరువ చేస్తుంది. దూరం తగ్గించడమే కాక అదొక అదనపు మార్గంగా నిలుస్తుంది. ఏపీలోని వెనుకబడిన జిల్లాలైన ఉమ్మడి కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటకలోని కోలార్ ప్రాంత ఆర్థిక ప్రగతికి ఉపయోగపడుతుంది. ఈ ప్రాంతాల నుంచి సరుకు రవాణాకు మార్గం సుగమం అవుతుంది.

నాలుగు దశల్లో పనులు..

కడప-బెంగళూరు రైల్వే లైన్ పనులు నాలుగు దశల్లో పూర్తిచేయాలని నాడు ప్రణాళికలు సిద్ధం చేశారు. మొత్తం రైల్వే మార్గం 268 కి.మీ కాగా.. ఇందులో 217.60 కి.మీ మన రాష్ట్రంలోని గుంతకల్ డివిజన్ పరిధిలో ఉంది. మిగతా 50.40 కి.మీ. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు రైల్వే డివిజన్ పరిధిలోకి వస్తుంది. మొదటి దశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు, రెండవ దశలో పెండ్లిమర్రి నుంచి రాయచోటి మీదుగా వాల్మీకిపురం వరకు పూర్తి చేయాలని నిర్ణయించారు. అలాగే మూడో దశలో వాల్మీకిపురం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని మదగట్ట వరకు, నాలుగో దశలో ముల్బాగల్ మీదుగా కోలార్-బంగారుపేట రైల్వే లైన్లో కలిసేలా ఈ రైలు మార్గాన్ని సిద్ధం చేశారు.

50-50 భాగస్వామ్యంతో..

కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టును 50-50 భాగస్వామ్యంతో పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పట్లో ఒప్పందం చేసుకున్నాయి. పనులు ప్రారంభించేటపుడు రూ.40కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టుకు 1531 హెక్టార్ల భూమి అవసరం కాగా ఇందులో 1250 హెక్టార్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా మగతా 281హెక్టార్లు కర్ణాటక రాష్ట్రంలో ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా.. 54 పెద్ద బ్రిడ్జిలు, 315 చిన్న బ్రిడ్జిలు నిర్మించాలని, 18 క్రషింగ్ స్టేషన్లు, 13 హాల్ట్ స్టేషన్లు నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎంతో ఘనంగా అంచనాలు తయారుచేసి పనులు ప్రారంభించారు.

ఐదేళ్లు వదిలేసిన జగన్

కడప-బెంగళూరు రైల్వే మార్గం అనేది అప్పటి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కల. ఆయన మరణానంతరం కూడా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, తర్వాత విభజిత రాష్ట్రానికి మొట్టమొదటి సీఎం అయిన చంద్రబాబు సైతం ప్రతి ఏడాది బడ్జెట్లో ఎంతో కొంత నిధులు కేటాయిస్తూ వచ్చారు. దీంతో మొదటి దశ అయిన కడప నుంచి పెండ్లి మర్రి వరకు రూ.317 కోట్లతో పెండ్లిమర్రి వరకు 21.8 కి.మీ పూర్తి చేశారు. పెండ్లిమర్రిలో రైల్వేస్టేషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం కొలువుదీరిన జగన్ ప్రభుత్వం ఈ రైలు మార్గాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. ఒక్క ఏడాది కూడా బడ్జెట్‌లో ఒక్కరూపాయి కేటాయించలేదు. దీనికితోడు అధికారం చేపట్టిన మూడేళ్ల తర్వాత కడప-బెంగళూరు రైల్వేమార్గం వద్దంటూ ముద్దనూరు పులివెందుల మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు చేయండి అని కేంద్రమంత్రికి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా నిధులిస్తేనే పనులు వేగవంతమవుతాయని కేంద్రం చెబుతోంది. రైల్వేలైన్ నిర్మాణం ఆలస్యం జరుగుతున్న కొద్దీ వ్యయం కూడా పెరుగుతోంది. ప్రస్తుత నిర్మాణ వ్యయం రూ.3037కోట్లకు పెరిగింది.

రూ.317 కోట్లు కంపచెట్లపాలు

కడప-బెంగళూరు రైల్వేమార్గం పనులు మొదటి దశలో భాగంగా రూ.317 కోట్లతో పెండ్లిమర్రి వరకు 21.8కి.మీ రైల్వేట్రాక్ ఏర్పాటు చేశారు. దీనిని టీడీపీ హయాంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో 16 జూన్ 2017 నాటికి పూర్తి చేశారు. పెండ్లిమర్రిలో రైల్వేస్టేషన్ కూడా కట్టారు. అంతే.. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఈ రైల్వేట్రాక్ పొడవునా కంపచెట్లు పెరిగిపోయాయి. పట్టించుకునేవారు లేకపోవడంతో పెండ్లిమర్రి రైల్వేస్టేషన్ సైతం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం పెండ్లిమర్రి వరకు ఏర్పాటుచేసిన రైల్వేలైన్ చిట్టడివిని తలపిస్తోంది. ప్రజాధనం రూ.317 కోట్లు నిరుపయోగం కావడంతో పాటు బెంగళూరుకు రైల్వేలైను ఏర్పాటు కాకపోవడంతో జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ చంద్రబాబు సీఎం కావడంతో ఇప్పుడు ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అయినా ఈ కడప-బెంగళూరు రైల్వేప్రాజెక్టును పూర్తిచేయాలని కడప, అన్నమయ్య జిల్లా వాసులు కోరుతున్నారు.



చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న సమయంలో 16జూన్2017నాటికి నిర్మాణం పూర్తయిన పెండ్లిమర్రి రైల్వేస్టేషన్



జగన్ ఐదేళ్ల పాలనలో నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచి శిథిలావస్థకు చేరిన పెండ్లిమర్రి రైల్వేస్టేషన్



2017లో టీడీపీహయాంలో రైల్వేట్రాక్ ఇలా..

వేల ఏళ్ల.. ఆనవాళ్లు

- శేషాచలంలో ప్రాచీన మానవ జీవనానికి సాక్ష్యాలు
- ఉమ్మడి జిల్లాలో బృహత్‌శిలాయుగం నాటి సమాధులు

6



సుండుపల్లె మండల పరిధిలోని శేషాచల పర్వతసానువుల్లో 4వేల ఏళ్ల క్రితం నాటి సమాధులు

ఊయలే ఉరితాడై..

- మెడకు చుట్టుకుని విద్యార్థి మృతి



మృతి చెందిన విష్ణువర్ధన్

మదనపల్లె అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగా ఇంట్లో అక్కతో పాటు ఆడుకుంటున్న ఆ చిన్నారి ఊయల ఊగుతూ.. అది మెడకు బిగుసుకుని మృతి చెందిన సంఘటన మదనపల్లెలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పోలీసుల వివరాల మేరకు... మదనపల్లె పట్టణం నక్కలదిన్నె సమీపంలోని నమాజ్‌కట్టకు చెందిన ఎస్.శంకరకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె శిరీషాకు ఇటీవల వివాహమైంది. పెద్ద కుమారుడు లక్ష్మివెంకటేశ్ 9వ తరగతి చదువుతుండగా మరో కుమార్తె అంకిత ఇంటి వద్దే ఉంటోంది. చిన్న కుమారుడైన ఎస్.విష్ణువర్ధన్ (13) స్థానిక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం వారిద్దరూ కూలీ పనులకు వెళ్లగా అక్క అంకితతో పాటు ఇంట్లోనే విష్ణువర్ధన్ ఉన్నాడు. అక్కతో పాటు ఆడుకుంటూ ఊయల ఊగుతుండగా అది ఒక్కసారిగా మెడకు చుట్టుకుంది. వెంటనే అక్క తమ్ముడిని గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి వెంటనే చిన్నారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిరంచారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు వచ్చిన భోరున విలపించారు. మృతదేహాన్ని శవపరీక్షల కోసం మార్చురీకి తరలించారు. వన్‌టౌన్ సీఐ ఎరిషావలి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబసభ్యులు

టీడీపీ సభ్యత్వాల్లో రాజంపేట నెంబర్‌వన్



కేక్ కట్ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి తదితరులు



సుగవాసిని సత్కరిస్తున్న గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ

- ఇన్‌చార్జి బాలసుబ్రమణ్యంకు ఘనసన్మానం

రాజంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో నిర్వహిస్తున్న సభ్యత్వ కార్యక్రమాల్లో రాజంపేట నియోజకవర్గం నెంబర్‌వన్ స్థానానికి చేరుకుంది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో శనివారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆరు మండలాల టీడీపీ నాయకులు పెద్దఎత్తున కేక్‌ను కట్‌చేసి భారీ గజమాలలు వేసి సుగవాసిని సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో సుగవాసి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కొందరి వెన్నుపోటు రాజకీయాల వల్ల స్వల్ప ఓట్లతో ఓటమి చెందామని, అయినా 85 వేల ఓట్లు టీడీపీకి వచ్చాయన్నారు. ఏప్రిల్ వరకు గడువు ఉన్నప్పటికీ నెల వ్యవధిలోనే 85 వేల సభ్యత్వాలను పూర్తి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానానికి చేరడం సంతోషంగా ఉందని, మరో వారం రోజుల్లో లక్ష సభ్యత్వాలు దాటించి రాజంపేటను అగ్రస్థానంలో నిలుపుతామన్నారు.

ఈ భారీ సభ్యత్వాల వల్ల వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో, సార్వత్రిక ఎన్నికల్లోను ఘన విజయం సాధించి తీరతామన్నారు. కార్యక్రమంలో రాజంపేట లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, ఆర్టీసీ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, మండల పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు నాగా సుధాకర్‌రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొండూరు కొండయ్యనాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, సుండుపల్లె మండలాధ్యక్షురాలు రాజమ్మ, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దంత వైద్య నిపుణులు డాక్టర్ నవీన్ లక్ష రూపాయల శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు.

మల్లయ్యకొండ అభివృద్ధి పనులకు స్థలాల పరిశీలన

- వాచ్‌టవర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

తంబళ్లపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండపైన పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి డీఎఫ్‌వో జగన్నాథ్ సింగ్ స్థలాలను పరిశీలించారు. శనివారం ఎఫ్ఆర్‌వో ప్రసాదరావుతో కలసి డీఎఫ్‌వో మల్లయ్యకొండలో ముమ్మరంగా పర్యటించారు. తొలుత ఆలయంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కొండపైన సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడానికి అనువైన స్థలాలను పరిశీలించారు. గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ వద్ద వాచ్‌టవర్ నిర్మాణం, వాచ్‌టవర్ వద్దకు దారి నిర్మాణానికి స్థలాలను పరిశీలించారు. అదేవిధంగా కొండపైన విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్లు నిర్మాణాలు, ఉద్యానవనాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు అనువైన స్థలాలను పరిశీలించి వెంటనే ప్రతిపాదనలు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా



మల్లయ్యకొండపైన గౌరమ్మకుప్ప వద్ద వాచ్‌టవర్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్

వారు మాట్లాడుతూ కొండపైన వాచ్‌టవర్ నిర్మించడం వలన పర్యాటకులకు చాలా ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. కొండకు వచ్చిన పర్యాటకులు ప్రకృతి అందాలతో పాటు, అడవి మొత్తాన్ని తిలకించేలా ఎత్తయిన ప్రాంతంలో వాచ్‌టవర్ నిర్మాణానికి స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. అదే విధంగా అడవిలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నపుడు గుర్తించడానికి వీలుగా కూడా వాచ్‌టవర్ ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట ఎఫ్ఎస్‌వో రెడ్డివరప్రసాద్, ఎఫ్‌బీవో రామరాజు, ఆలయ సిబ్బంది కొండ కిట్టు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

కలకడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ కలకడ గురుకుల పాఠశాల (బాలికల) వార్డెన్‌ను ఆదేశించారు. శనివారం కలెక్టర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటకాలు రుచికరంగా లేకపోవడం, అన్నం ముద్దగా ఉండడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున్న వారికి సౌకర్యంగా రెండు వరుసల్లో భోజనాన్ని వడ్డించాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి ఫేస్ రికగ్నిజేషన్ గురించి ప్రిన్సిపాల్‌ను ఆరా తీశారు. పాఠశాల అద్దె భవనంలో నడుస్తున్న విషయాన్ని గమనించి సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతానని తెలిపారు. ఇతర సమస్యలను విద్యార్థినులతో మాట్లాడి అడిగి తెలుసుకుని వారితో కలిసి భోజనం చేశారు. అలాగే బాటవారిపల్లె పంచాయతీ కె.మాదిగపల్లె అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు, కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించారు. కలకడ హౌసింగ్ లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఇసుక లభ్యత, మెటీరియల్ ధరల గురించి లబ్ధిదారులతో మాట్లాడారు. లేఅవుట్‌లో గతంలో ఇళ్లు మంజూరై నిర్మాణాలు చేపట్టని వారి స్థానంలో అర్హులైన ఇతరులకు కేటాయించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు కలెక్టర్ మండల సమైక్య కార్యాలయంలో ప్రభుత్వ అభివృద్ధి పనుల గురించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా అందిన అర్జీల పరిష్కారంలో, అపార్ ఐడీల మంజూరులో సిబ్బంది బాగా పనిచేస్తున్నారని ఇదే విధంగా కొనసాగించాలని అభినందించారు. అలాగే సర్వే రాళ్లపై ఉన్న బొమ్మలు, రాతలు చెరిపి వేసే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఎర్రకోటపల్లె పంచాయతీ వెంకటగారిపల్లెలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ వెంట డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు వెంకటరత్నం, సత్యనారాయణ, తహశీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో అబ్దుల్ రహీం, సిబ్బంది వెంకటసుబ్బయ్య, మునీంద్రనాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

వాల్మీకిపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా ఇసుక స్థానిక అవసరాలకు కాకుండా బయటి ప్రాంతాలకు అక్రమంగా రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ పామిలేటి హెచ్చరించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఇసుక అక్రమాలపై 'తవ్వుకో..అమ్ముకో' అన్న కథనం పట్ల రెవెన్యూ అధికారులు స్పందించారు. పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్, తదితర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా అక్రమ రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్లపై ముమ్మర నిఘా పెట్టారు. ఎవరు అక్రమ తవ్వకాలకు పాల్పడినా, బయటి ప్రాంతాలకు రవాణా చేసినా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి స్పందన



బృహత్ శిలాయుగం నాటి సమాధులు ఉన్న శేషాచలకొండలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

వేల ఏళ్ల.. ఆనవాళ్లు

శేషాచలంలో ప్రాచీన మానవ జీవనానికి సాక్ష్యాలు

అన్నమయ్య జిల్లాలో బృహత్ శిలాయుగం నాటి సమాధులు

1914లోనే వీటిని గుర్తించిన ఆంగ్లేయుడు రాబర్ట్ ఫూటే

పాండవుల గుళ్లుగా పిలుస్తున్న స్థానిక ప్రజలు

బండలపై ఆ కాలం నాటి అపురూప రేఖాచిత్రాలు

పట్టించుకునేవాళ్లులేక ఛిద్రమవుతున్న చారిత్రక సంపద

ప్రభుత్వం చొరవ చూపితే పర్యాటక కేంద్రంగా మారే అవకాశం

చుట్టూ దట్టమైన అడవి. ఆ అడవి మధ్య పద్ధతి ప్రకారం అమర్చిన రాళ్లు. నాలుగు రాళ్లను నిలిపి.. వాటిపైన మూతగా ఓ పెద్ద బండ. అలా పెట్టిన కొన్ని రాళ్ల చుట్టూ.. తామరపూల ఆకారంలో నిలువుగా అమర్చిన బండరాళ్లు. అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం రాయవరం గ్రామం దేవవాండ్లపల్లె సమీపంలోని ఎర్రకొండల్లో ఇటువంటి నిర్మాణాలున్నాయి. ఆ బండరాళ్ల వెనుక మూడువేల సంవత్సరాలకు పూర్వం మనుషుల జీవన విధానాన్ని తెలిపే చరిత్ర ఉంది. ఆదిమ మానవుడు రాతియుగం నుంచి అభివృద్ధి చెందుతూ.. ఇనుమును వినియోగించిన కాలం (బృహత్ శిలాయుగం) నాటి చరిత్ర అది. అప్పట్లోనే ఇక్కడ జీవించిన మానవులు తమ సమాధులను ఎలా నిర్మించారో నేటి తరానికి తెలియజేసే ఆనవాళ్లే ఆ పెద్దపెద్ద రాతి నిర్మాణాలు. ప్రస్తుతం వీటి ఆలనాపాలనా చూసేవారు లేక.. ప్రభుత్వాలు పట్టించుకోక.. గుప్తనిధులు ఉంటాయేమోననే కొందరి దురాశ కారణంగా.. ఆ నిర్మాణాలు ధ్వంసమై శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

నాలుగు ఎకరాల్లో.. 50 నిర్మాణాలు

అన్నమయ్య జిల్లాకు ఎంతో ప్రాచీన చరిత్ర, సంస్కృతి ఉన్నాయనడానికి ఈ రాతి నిర్మాణాలే నిదర్శనం. దేవవాండ్లపల్లెకు ఉత్తర దిశలో దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలోని శేషాచలకొండల్లోని ఎర్రకొండల్లో ఈ నిర్మాణాలు ఉన్నాయి. పురావస్తు పరిశోధకుల ప్రకారం.. ఇక్కడి రాతి నిర్మాణాలు మూడు వేల ఏళ్ల క్రితం బృహత్ శిలాయుగంలో మరణించిన మనుషుల సమాధులు. అవి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం అన్నీకలిపి 50 వరకు ఉన్నాయి. పూర్వ కాలంలో ఎవరైనా మరణిస్తే.. ప్రత్యేక పద్ధతిలో పెద్దపెద్ద బండరాళ్లను ఉపయోగించి సమాధులు నిర్మించే వారు. సాధారణంగా సమాధుల్లో డాల్‌మెన్స్, స్టోన్ సర్కిల్స్, మెన్‌హిర్స్, సిస్టబరియల్స్, డాల్‌మెనాయిడ్ సిస్ట్ అనే రకాలు ఉంటాయి. దేవవాండ్లపల్లెలోని సమాధులు.. డాల్‌మెన్స్ రకానికి చెందినవి. వీటి నిర్మాణానికి ఆర్కియన్ యుగపు గ్రానైట్ రాయిని ఉపయోగించారు. ఈ సమాధుల్లో మృతదేహంతో పాటు.. ఇనుప పరికరాలు, మట్టి పాత్రలు వేసి పూడ్చేవారు. సమాధుల లోపలి బండలపై ఆనాటి కాలంలో చిత్రించిన తెలుపు రంగులో ఏనుగు, ఏనుగుపై సవారీ చేస్తున్న మనిషి, తాబేళ్లు, డైనోసార్స్‌ను పోలిన రేఖాచిత్రాలు ఉన్నాయి. సమాధుల వద్దకు అడవి జంతువులు వెళ్లడానికి వీలు లేకుండా వాటి చుట్టూ తామరపూవు ఆకారంలో 10నుంచి 15 అడుగుల ఎత్తు ఉన్న పెద్దపెద్ద బండరాళ్లు నిలబెట్టారు. ఈ నిర్మాణాలకు సమీపంలోనే ఉన్న మరో గుట్టపైన శ్లాబ్స్ ఉన్న డాల్‌మెన్స్ ఉన్నాయి.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

వేల సంవత్సరాల నాటి ఈ బృహత్ శిలాయుగపు సమాధులు ఉన్న ప్రాంతాన్ని ఇప్పటికైనా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఇవి ఉన్నచోటుకు చేరుకోవాలంటే అడవిలో చాలా దూరం నడవాల్సి ఉంటుంది. అయితే ఈ సమాధులకు ఉన్న చరిత్ర, ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే.. పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చి చారిత్రక విశేషాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఈ రాతి సమాధులు ఉన్న ప్రాంతం చుట్టూ కంచె ఏర్పాటు చేసి వాటిని రక్షిస్తే.. భవిష్యత్తు తరాలకు భద్రంగా అందించే అవకాశం ఉంటుంది.

దక్షిణ భారతదేశంలో ఎక్కువ

ప్రాచీన కాలంలో రాతి సమాధుల సంస్కృతి దక్షిణ భారతదేశంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అలాంటి సమాధులు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. ఈశాన్య భారతంలో కూడా కొన్ని చోట్ల ఉన్నాయి. ఉత్తర భారతదేశంలో మాత్రం ఇలాంటి సమాధులు కనిపించవు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా రాయలసీమలోనే ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో ఉన్న వాటిలో దేవవాండ్లపల్లె వద్ద ఉన్నవే పెద్దవి కావడం విశేషం. సుండుపల్లె మండలం మడితాడు గ్రామం పడమర వైపు చెన్నకేశవ స్వామి దేవస్థానం వెనుక వైపు ఉన్న గుట్టల్లోనూ.. ఇటువంటి రాతి సమాధులు సుమారు 20 వరకు ఉన్నాయి. సంబేపల్లె మండలంలోనూ అక్కడక్కడా కనిపిస్తాయి. చిత్తూరు జిల్లాలోనూ.. ఇటువంటివి పలుచోట్ల ఉన్నాయి. దక్షిణ కర్ణాటక మూడ్‌బిదిరి ప్రాంతంలో.. అచ్చం దేవవాండ్లపల్లెలో ఉన్నట్లే సమాధుల నిర్మాణాలు ఉన్నాయి. అయితే ఎక్కువగా సమాధులు ఉన్నది మాత్రం సుండుపల్లె మండలంలో మాత్రమే. అయితే వీటిలో పాండవులు అజ్ఞాతవాస కాలంలో నివసించారని.. కడప, చిత్తూరు జిల్లా ప్రజల విశ్వాసం. దీంతో వీటిని ఈ జిల్లాల్లో పాండవుల గుళ్లుగా పిలుస్తారు. దేవవాండ్లపల్లె ప్రజలు వీటిని పాండురాజు గుళ్లు అంటారు. ఇలాంటి సమాధుల్లో రాక్షసులు నివసించారని భావించే కర్నూలు, ప్రకాశం జిల్లాల ప్రజలు వీటిని రాక్షస గుళ్లు అని పిలుస్తారు.



మరో బండపై చతురస్రాకారంలో ఉన్న నిర్మాణాలు

అపురూపమైన చారిత్రక సంపద



ఈ కట్టడాలు బృహత్ శిలాయుగం నాటి మానవుల సమాధులు. గతంలో పరిశోధనలు చేసిన వారు ఇవి దాదాపు 3 వేల ఏళ్లనాటివి అని చెప్పారు. అయితే ఇటీవల హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ వారు.. ఇలాంటి సమాధుల్లో దొరికిన వాటిని అధునాతన పద్ధతుల్లో పరిశీలించి ఇవి దాదాపు 4,400 ఏళ్లనాటివని తేల్చారు. ఈ సమాధుల బండలపైన రాళ్లను పిండిచేసి అందులో ఆకుపసరులు కలిపి నాటి మానవులు బొమ్మలు గీశారు. ఇవి సహజమైన రంగులు కావడంతో ఇప్పటికీ చెరిగిపోకుండా ఉన్నాయి. ఇలాంటివి దక్షిణ భారతదేశంలో.. ముఖ్యంగా రాయలసీమలో ఎక్కువగా ఉన్నాయి. ఈ నిర్మాణాల్లో నిధులేవీ ఉండవు. కొందరు ఈ బండలను పొలాలకు కంచెలకు, ఇళ్లకు వాడుకుంటున్నారు. ఇవి అపురూపమైన చారిత్రక సంపద. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ముఖ్యంగా పురావస్తుశాఖ, రెవెన్యూ వారు వీటిని పరిరక్షించాల్సి ఉంది.

– జాదవ్ విజయకుమార్, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్, పురావస్తుశాఖ

1914లో వెలుగులోకి..

ఈ సమాధులను మొట్టమొదట 1914లో గుర్తించారు. అప్పటి బ్రిటిష్ పాలనలో రాబర్ట్ బ్రూస్ ఫూటే అనే ఆంగ్లేయుడు వీటిని మొదటిసారిగా గుర్తించాడు. ఈ మేరకు 'ది ఫూటే కలెక్షన్ ఆఫ్ ఇండియన్ ప్రి-హిస్టారిక్ అండ్ ప్రోటో-హిస్టారిక్ యాంటిక్విటీస్ కేటలాగ్ రైజాన్ బై మద్రాస్ గవర్నమెంట్ ప్రెస్'లో రికార్డయింది. అనంతరం వీటిని ఎవ్వరూ పట్టించుకోలేదు. దాదాపు ఎనిమిదేళ్ల క్రితం చరిత్రకారులు కొందరు ఇక్కడికి వెళ్లి వీటిని పరిశీలించారు. అయినా ఇవి పెద్దగా వెలుగులోకి రాలేదు.



శేషాచలకొండల్లోని ఎర్రకొండలో ఒక పెద్ద బండపై తామరపూవు ఆకారంలో ఉన్న రాతికట్టడాలు (సమాధులు)

హార్సిలీహిల్స్‌లో అభివృద్ధి పనులు

● డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్



హార్స్‌లీహిల్స్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

బి.కొత్తకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్‌లోని అటవీ ప్రాంగణంలో పర్యాటకులను ఆకర్షించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి జగన్నాథ్‌సింగ్ తెలిపారు. శనివారం ఆయన బి.కొత్తకోట మండల పరిధిలోని హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. ఇటీవల రూ.10 లక్షలతో ఆధునీకరించిన అతిథిగృహంతో పాటు, ప్రస్తుతం రూ.20 లక్షలతో నిర్మిస్తున్న మరో అతిథిగృహం పనులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిల్స్‌పై అటవీశాఖ ప్రాంగణంలోని మానససరోవరంలో బోటింగ్ పర్యాటకులను బాగా ఆకర్షిస్తోందని, పర్యాటకుల భద్రతతో పాటు, అతిథి గృహాల అద్దెలను రీజనబుల్‌గా వసూలు చేస్తున్నామన్నారు. జూపార్క్‌లతో పాటు ప్రతిపాదనలు పంపిన పలు అభివృద్ధి కార్యక్రమాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

అడవి పంది మాంసం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

పెద్దతిప్పసముద్రం నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అడవి పంది మాంసాన్ని గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్న ముగ్గురిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ములకలచెరువు ఫారెస్ట్ రేంజ్ సెక్షన్ అధికారి షబీన్‌తాజ్, ఫారెస్ట్ బీట్ అధికారి ప్రకాష్‌కుమార్‌లు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రం మండలం రాపూరివాండ్లపల్లె పంచాయతీ కాయలవాండ్లపల్లెకు చెందిన శ్రీరాములు, రెడ్డెప్ప, జయచంద్ర అనే ముగ్గురు అడవి పంది మాంసాన్ని విక్రయిస్తున్నారన్న సమాచారంతో కాయలవాండ్లపల్లెకు చేరుకుని వారు విక్రయిస్తున్న అడవి పంది మాంసంతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకుని ములకలచెరువు అటవీశాఖకు సంబంధించిన స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు వారిని ములకలచెరువులోని అటవీశాఖ స్టేషన్‌లో ఉంచినట్లు తెలిపారు.

ప్యాసింజర్ రైళ్లకు కొత్త నెంబర్లు కేటాయింపు



ములకలచెరువు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్లకు రైల్వేశాఖ కొత్త నెంబర్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మారిన రైళ్ల నెంబర్లు జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని ప్రకటించింది. తిరుపతి-గుంతకల్లు-కదరిదేవరపల్లెకు రాత్రి, ఉదయం నడిచే నాలుగు రైళ్ల నెంబర్లు మారాయి.

ప్యాసింజర్ రైలు	పాత నెంబరు	కొత్త నెంబరు
1) తిరుపతి-గుంతకల్లు (ఉదయం)	07656	57403
2) గుంతకల్లు-తిరుపతి (ఉదయం)	07655	57404
3) తిరుపతి-కదరిదేవరపల్లె (రాత్రి)	07589	57405
4) కదరిదేవరపల్లె-తిరుపతి (రాతి)	07590	57406

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య



స్వాతి మృతదేహం

మదనపల్లె అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మదనపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం ఫైర్‌స్టేషన్ పక్కన శేషమహల్‌కు వెళ్లేవీధిలో కాపురం ఉన్న నరేష్ భార్య జి.స్వాతి బాత్‌రూమ్‌లో తాడుతో ఉరి వేసుకొని మృతి చెందింది. గమనించిన స్థానికులు వెంటనే వన టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి మహిళను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సిఉంది. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఎరిషావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



బాలగంగాధర్‌నాయుడు, శివ

గాలివీడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎగువగొట్టివీడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు బాలగంగాధర్ నాయుడు, కె.శివ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కవారిపల్లె, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో తమ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సిద్దవటం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సిద్దవటం పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని గాండ్లపాలెం వద్ద పెన్నానది నుంచి బద్వేల్‌కు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆ వాహనాలను తహసీల్దారుకు అప్పజెబుతామన్నారు. గృహనిర్మాణాలకు మాత్రమే ఉచితంగా ఇసుక రవాణా చేయాలని, దూర ప్రాంతాలకు ఇసుక రవాణా చేయరాదని ఎస్ఐ తెలియజేశారు.

విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురిపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురిపై కేసు నమోదైంది. పీటీఎం ఎస్ఐ నరసింహుడు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నవాబుకోట పంచాయతీ వరికసువుపల్లెకు చెందిన బయ్యారెడ్డి అనే వ్యక్తి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా వరికసువుపల్లె సమీపంలోని తుమ్మరకుంట రెవిన్యూ సరిహద్దులో ప్రభుత్వ భూమిలో దహనక్రియలను చేసేందుకు ఆయన కుటుంబీకులు యత్నించారు. దీంతో సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీరాములు నాయక్ తమ సిబ్బందితో కలసి అక్కడికి చేరుకుని దానిని అడ్డుకున్నారు. దీంతో వారిపై మృతుడి కుటుంబ సభ్యులు దౌర్జన్యానికి దిగారు. తమ విధులకు ఆటంకం కలిగించి దౌర్జన్యం చేశారని వరికసువుపల్లె గ్రామానికి చెందిన ఏడుగురిపై పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

టౌన్‌బ్యాంకు నామినేషన్లన్నీ సక్రమమే

● స్ర్కూటిని పూర్తి



నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

మదనపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం స్క్రూటినీ పూర్తి చేశారు. శుక్రవారం 12 మంది అభ్యర్థులు దాఖలు చేసిన అన్ని నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ ప్రకటించారు. ఇందులో భాగంగా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు ఛైర్మన్ అభ్యర్థి నాదెళ్ల విద్యాసాగర్‌తో పాటు ఆయన ప్యానల్‌లోని నిమ్మనపల్లె ముక్తియార్‌ఖాన్, సూరె రవీంద్రనాథ్, నవరం భాస్కర్‌కుమార్, రాటకొండ సోమశేఖర్, దిగువపాళెం నిరంజన్‌కుమార్, నాదెళ్ల వెంకటేశ్వరప్రసాద్, శ్రీరామ రవికాంత్‌బాబు, రామిశెట్టి భాస్కర్, ఆకుల కృష్ణమూర్తి, పఠాన్ సర్దార్‌ఖాన్, జోళపాళం కృష్ణమూర్తి దేవేంద్రబాబులు హాజరయ్యారు. ఎన్నికల అధికారులు ఒక్కొక్కరిని పిలుస్తూ వారి ముందు నామినేషన్‌ను నిశితంగా పరిశీలించారు. ఇలా 12 మంది నామినేషన్లను పరిశీలించిన దుర్గమ్మ అంతా ఒకే అంటూ ప్రకటించడంతో అటు అధికారులు, ఇటు అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. అయితే పోటీలోని అభ్యర్థులందరూ ఒక్కొక్కటే నామినేషన్ దాఖలు చేయడం, పైగా నిబంధనల ప్రకారం ప్యానల్‌లోని సంఖ్యకు సరిపడా అభ్యర్థులే పోటీపడటంతో నామినేషన్ల ఉపసంహరణ అనే మాట ఉండదు.

తర్వాత ఎన్నికల క్రతువులో పోటీలోని అభ్యర్థులను ఎన్నికల అధికారి దుర్గమ్మ అధికారికంగా ప్రకటించడం, వారి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్, వైఎస్ ఛైర్మన్ ఎన్నిక జరగనుంది. ఇందులో ఛైర్మన్‌గా నాదెళ్ల విద్యాసాగర్, వైస్‌ఛైర్మన్‌గా ఎస్.భాస్కర్‌కుమార్‌లను ఎన్నుకోనున్నారు.

పొట్టేళ్లపై చిరుతపులి దాడి



చిరుతపులి దాడిలో గాయపడిన పొట్టేళ్లు

నిమ్మనపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిరుతపులి నిత్యం ఏదో ఒక చోట మూగజీవాలపై దాడులు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. తాజాగా శనివారం మండలంలోని ముష్టూరు పంచాయతీ పారేసువారిపల్లికి చెందిన రైతు రాజగోపాల్ తన వ్యవసాయ పొలం వద్ద పొట్టేళ్లను మేపుకుంటుండగా చిరుతపులి పొట్టేళ్ల మందపై దాడి చేసి రెండు పొట్టేళ్లను పట్టుకుంది.

వెంటనే అక్కడే ఉన్న రైతు పెద్దగా అరవడంతో వాటిని వదిలి పారిపోయినట్లు తెలిపాడు. కాగా చిరుతపులి బోడికొండ, చలిమామిడికొండ ప్రాంతాలలో తిరుగుతూ కనిపించిన మూగజీవాలను చంపుతోంది. నాలుగు చిరుతలు వాటి పిల్లలు కూడా ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో అటవీ ప్రాంత సమీపంలో ఉన్న పొలాల వద్దకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు చిఌతపులిని పట్టుకొని మూగజీవాలతో పాటు మనుషుల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పీలేరులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పర్యటన



వంటశాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మజ

పీలేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీఎస్ పద్మజ శనివారం పీలేరులో విస్తృత పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా ఆమె శనివారం స్థానిక ఆయిల్ సీడ్స్‌లోని బాలికల గురుకులం, చిత్తూరు మార్గంలోని డా.బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులం, కోర్టు ప్రాంగణాలు, సబ్‌జైలును సందర్శించారు. గురుకులాల్లో బాలికలతో మాట్లాడారు. అక్కడ విద్యార్థినులకు అందుతున్న భోజన సదుపాయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ సీడ్స్‌లోని గురుకులంలో వంట శాల నిర్వహణ బాగోలేదని, దానిని సరిజేసుకోవాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతున్నాదా లేదా అంటూ సబ్‌జైలులోని ఖైదీలను ఆరా తీశారు. శిక్ష అనుభవించిన అనంతరం ప్రవర్తనలో మార్పు రావాలని వారికి హితవు పలికారు. డిసెంబరు 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ సన్నాహకాల్లో భాగంగా పీలేరు కోర్టుల పరిధిలోని పోలీసు అధికారులు, న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కక్షిదారులకు లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని సూచించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పీలేరు సీనియర్ సివిల్ జడ్జి రవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీసీ పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగ పనుల్లో పురోగతి సాధించాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పల్లెపండుగ పనులు అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, నీటివసతి తదితర అంశాలపై కలెక్టర్ పంచాయతీరాజ్ శాఖ గ్రామీణ నీటి సరఫరా శాఖ, ఐసీడీఎస్ శాఖాధికారులు, సిబ్బంది, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లెపండుగ పనుల్లో పురోగతి సాధించాలని, వందశాతం పనులు గ్రౌండింగ్‌లో కావాలని ఎంపీడీవోలను, పంచాయతీరాజ్, డ్వామా శాఖల సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలను నిర్వహించి పురోగతి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఎస్‌ఈని, డ్వామా పీడీ ఆదేశించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నీటి వసతి ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారి ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల ఏర్పాటుపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి పురోగతి సాధించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈని, ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఎస్‌ఈ దయాకర‌రెడ్డి, డ్వామా పీడీ వెంకటరత్నం, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఆక్రమణల పర్వం

మైసూరివారిపల్లెలో వంకపోరంబోకు స్థలాన్ని ఆక్రమిస్తున్న వైనం ● రూ. కోట్లు విలువైన భూములు కబ్జా
17 ఎకరాల్లో మిగిలింది 4 ఎకరాలు! ● ఖద్దరుబాబుల అండతో యథేచ్ఛగా సాగుతున్న తంతు

రైల్వేకోడూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మైసూరివారిపల్లె పంచాయతీలో ఉన్న వంకపోరంబోకు భూమిని కొందరు ఆక్రమిస్తున్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి సదరు భూమిని పరిశీలించింది. అక్కడ ఆక్రమణలు కోకోల్లుగా బయటపడుతున్నాయి. రూ. కోట్లు విలువైన భూమిని ఆక్రమిస్తున్నారు. ఖద్దరు బాబుల అండతో ఆక్రమణలు దర్జాగా చేస్తున్నారు. సర్వే నెంబరు 2085లో 17.54 ఎకరా ల భూమి ఉండేది. కాలక్రమేణ ఈ భూమి ఆక్రమణలు చేయడంతో కేవలం సుమారు 4 ఎకరా లు మాత్రమే మిగిలింది. మిగిలిన భూమిని కూడా ఆక్రమిస్తున్నారు. కాపాడిన వారే ఆక్రమిం చుకోండి అని చెప్పడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఓ మతానికి చెందిన వారికి సుమారు 4 ఎకరాలు కేటాయించారు. ఇది పోను మిగిలిన భూమి కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఈ భూమికి పక్కనే ప్రధానదారికి ముందు భాగంలో సుమారు ఐదెకరాల భూమిలో ఓ సోప్ పరిశ్రమ ఉండేది. సోప్ పరిశ్రమ మూత పడింది. తర్వాత ఓ నాయకుడు ఆ స్థలాన్ని తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత సోప్ పరిశ్రమ భవనాలను కూల్చి భూమిని చదును చేశారు. ఈ భూమి వెనుక భాగంలోనే వంకపోరంబోకు భూమి ఉంది. ఈ భూమిపై వైసీపీ ప్రభుత్వంలో అనేకులు కన్నే శారు. అయితే జనసేన కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసు ల అండతో ఆక్రమణల పర్వం చేయాలని చూశారు. మైసూరివారిపల్లె గ్రామస్తులు చాలా సార్లు అడ్డుకున్నారు. ఖద్దరు బాబుల అండతోనే ఆక్రమణలు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ తంతు కూటమి ప్రభుత్వం వచ్చినాటి నుంచి మొదలు పెట్టడం, అధికారం మనదే కదా అని ఆక్రమ ణలు చేయడం కొసమెరుపు.



వంకపోరంబోకు భూమిలో కంచె వేసిన ఆక్రమణదారులు

ఉన్నతాధికారులకు నివేదిక

ఆక్రమణలపై జిల్లా ఉన్నతాధికారులకు నివే దిక పంపినట్లు రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తెలిపారు. మైసూరి వారిపల్లె వంకపోరంబోకు స్థలంలో ఎవరు ఆక్రమణ లు చేశారు, ఎంత వరకు జరిగాయి తదితర అంశాలపైన సర్వే చేయిస్తామని ఆయన వివరించారు.

ప్రభుత్వ పక్కాగృహంలో ఎర్రచందనం దుంగలు

ముద్దనూరు నవంబరు23(ఆంధ్రజ్యోతి): కొండప్రాంతంలో లబ్ధిదారులకు కేటాయించిన ప్రభుత్వ పక్కాగృహంలో నిల్వ చేసిన ఎర్రచందనం దుంగలను శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి టాస్క్‌ఫోర్సు అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్ఓ అశోక్‌కుమార్ యాదవ్ వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముద్దనూరు పాతవీధిలోనున్న మల్లేశ్వరికి చెందిన నిర్మాణంలో నున్న ప్రభుత్వ పక్కాగృహంలో 32 ఎర్రచందనం దుంగలు నిల్వ చేసి ఉన్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు అధికారులు వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఇక్కడ దుంగలు ఉన్నట్లు తెలిసింది. దీంతో సీక్రెట్ ఆపరేషన్‌లో భాగంగా టాస్క్‌ఫోర్సు అధికారులు తెల్లవారుజామున దాడి చేసి స్వాధీనం చేసుకుని, దుంగలను తిరుపతికి తరలించారు. రెండు రోజుల్లో కేసు ముద్దనూరు అటవీ రేంజ్‌కి బదిలీ చేస్తారని తెలిపారు.

ఆయుర్వేద దుకాణంపై విజిలెన్స్ తనిఖీ

కడప క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం గుంతబజారులోని ఆరోగ్యరక్ష ఆయుర్వేద మందులషాపుపై శనివారం విజిలెన్స్ అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేపట్టారు. వైద్య అర్హతలు లేకుండా పేషంట్లకు ఆయుర్వేద మందులను ఇస్తున్నట్లు గుర్తించామని అనుమతులు లేకుండా తైలాలు తయారు చేసి స్టిక్కర్లు అతికించిన వాటిని సీజ్ చేశారు. ఎఫ్ఆర్వో మురళీక్రిష్ణ, మెడికల్ ఆఫీసరు రిమ్స్ డాక్టర్ ఎస్.మురళీబాబు పాల్గొన్నారు.



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎఫ్ఆర్వో మురళీక్రిష్ణ,

గండి క్షేత్రంలో రామ్‌దిన్ అన్నదానం

అన్నదాత ఉత్తర్ ప్రదేశ్ వాసి



గండి క్షేత్రంలో అన్నం వడ్డిస్తున్న రామ్‌దిన్

చక్రాయపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామ్‌దిన్ అన్నదానం చేస్తున్నారంటే గండిలో ప్రత్యేకత సంతరించుకుంటుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన భారీఘాట్ బస్తీ వాసి రామ్‌దిన్ రామభక్తుడు. ఏటా కార్తీకమాసంలో గండి దేవస్థానంలో వేలాది మందికి అన్నదానం చేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శనివారం గండి క్షేత్రంలో 7వేల మందికి అన్నదానం గావించారు. పలు రకాల అన్నం, కూరలు, వడ, బజ్జీలు తదితర వాటిని భక్తులకు వడ్డించారు. ఉదయం 10గంటలకు ప్రారంభించి రాత్రి 8గంటల వరకు అడిగడిగి మరీ అన్నదానం చేశారు. కాగా ఇంకా మూడు అండాల అన్నం మిగిలిపోవడంతో అనాథాశ్రమాలకు తరలించారు. ఈయన దాతృత్వం ఇంతా అంతా కాదు. ప్రతి భక్తుడూ అన్నదాత సుఖీభవ అంటూ దీవించారు. ఏటా శనివారం దాదాపు రూ.2లక్షలకు పైబడి ఖర్చు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో గండి ఈఓ వెంకటసుబ్బయ్య, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, రామ్‌దిన్ బంధువులు, మిత్రులు పాల్గొన్నారు. మండలంలోని నాగులగుట్టపల్లె సమీపంలోని దశరథ మహారాజ ఆలయం వద్ద అయ్యప్పస్వాములకు అన్నదానం గావించారు.

అరుణాచలానికి బస్సు సౌకర్యం

పోరుమామిళ్ల,నవంబరు23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా అరుణాచలానికి బస్సు సౌకర్యం కలగజేస్తున్నట్లు బద్వేలు ఆర్టీసీ డీఎం తెలిపారు. ఆదివారం రాత్రి 7గంటలకు పోరుమామిళ్ల నుంచి నేరుగా అరుణాచలానికి బస్సు వెళుతుందని సోమవారం ఉదయం 5గంటలాకల్లా అరుణాచలం చేరి గిరిప్రదక్షిణ చేసిన తరువాత గోల్డెన్ టెంపుల్ కూడా సందర్శించవచ్చని తెలిపారు. అరుణాచలానికి వెళ్లేవారు 7981554538, 7382865220కి ఫోను చేయాలన్నారు. టికెట్ ఫోను ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. ఒక టికెట్‌కు రూ.1300 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నీ నేడు

కడప స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెల్లంమండీ వీధిలోని ఇంటర్‌నేషనల్ ఫంక్షన్ హాలులో ఆదివారం రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనీస్ దర్బారీ తెలిపారు. చెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులందరికీ ఉచిత భోజన వసతి ఇనతి, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.
క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి

ప్రతి సంఘం ఆర్థికంగా బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఆనంద్‌నాయక్

కమలాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి డ్వాక్రా సంఘం ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత సంఘం సభ్యులపై ఉందని పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. శనివారం కమలాపురం మండల సమాఖ్య సమావేశ సభ భవనంలో సమాఖ్య ఓబీలు, ఈసీ మెంబర్స్, గ్రామ సమాఖ్య సహాయ సేవకురాళ్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ప్రాజెక్ట్ డైరెక్టరు ఆనంద్‌నాయక్ మాట్లాడుతూ మండల మహిళా మార్ట్ ఏర్పాటు గురించి సభ్యుల ఆర్థిక ఆదాయ జీవనోపాధి ప్రణాళిక సర్వే తదితర విషయాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. సీసీలను పని విధానంపై సమీక్ష చేయడం జరిగిందని తెలిపారు.

'క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు'



క్రీడాకారిణులతో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

కడప స్పోర్ట్స్ నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని విశ్రాంత స్టెప్ సీఈఓ డాక్టర్ రామచంద్రారెడ్డి యువ క్రీడాకారులకు సూచించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ఆధ్వర్యంలో శనివారం డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో కబడ్డీ పురుషుల, మహిళల జట్ల ఎంపికలు జరిగాయి. ఆయన ఔత్సాహిక మహిళా, పురుష క్రీడాకారులతో మాట్లాడుతూ క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేలా 2 శాతం వున్న రిజర్వేషన్లను 3 శాతానికి పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రతి క్రీడాకారుడూ వారు ఎంచుకున్న క్రీడా విభాగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ సెక్రటరీ శ్రీవాణి, డీఎస్ఏ కబడ్డీ కోచ్ శ్రీధర్, పీడీ సుబ్బన్న, లక్ష్మీశ్రీనాథ్, సుమారు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

ఆకట్టుకుంటున్న వజ్రాభరణాల ప్రదర్శన

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుశెట్టి కల్యాణ మండపంలో బుశెట్టి డైమండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. శనివారం ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల ఆభరణాలను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వజ్రాభరణాలను అందించడానికి మూడోసారి వజ్రాభరణాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.6 వేల నుంచి రూ.25 లక్షలు విలువైన వీవీఎస్ఈఎఫ్ఐజీఐ డైమండ్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ముక్కుపుడక, చైన్లు, కమ్మలు, ఉంగరాలు, నల్లపూసల దండలు, గాజులు వంటి ఆభరణాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఆదివారం కూడా ఈ ప్రదర్శన ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.



వజ్రాభరణాలను తిలకిస్తున్న దృశ్యం

ఆర్ట్‌క్యాంపు మెంటార్‌గా మృత్యుంజయరావు



కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముంబైలోని ప్రతిష్ఠాత్మకమైన కోఫియో క్యామ్‌లిన్ ఆర్ట్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న దక్షిణ భారతదేశ పెయింటింగ్ క్యాంపునకు తెలుగు రాష్ట్రాల తరపున మెంటార్‌గా వైవీయూ లలిత కళల విభాగం అధిపతి డాక్టర్ మృత్యుంజయరావు ఎంపికయ్యారు. ఈ మేరకు క్యామ్‌లిన్ ఫౌండేషన్ నుంచి ఆయనకు సమాచారం అందింది. ఈ నెల 25 నుంచి 30 వరకు కర్ణాటక రాష్ట్రం హంపిలో ఉన్న హంపీ యూనివర్శిటీ క్యాంపస్‌లో ఈ శిబిరం జరగనుంది. దక్షిణ భారతదేశంలోని ఫైన్‌ఆర్ట్స్ కాలేజీల నుంచి ఎంపిక చేయబడిన దాదాపు 80మంది యువ చిత్రకారులు పాల్గొననున్నారు.

రెవెన్యూ అనుమతులతో మట్టి తవ్వుకోవాలి



ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వుతున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల అనుమతులతో మట్టితోలకాలు జరగాలని తహసీల్దారు దామోదరరెడ్డి తెలిపారు. శనివారం బ్రహ్మంగారిమఠం తోట్లపల్లె సమీప కొండ ప్రాంతంలో కొందరు అనుమతులు లేకుండా మట్టిని తోలుకుంటున్నారన్న విషయం తమ దృష్టికి రావడంతో రెవెన్యూ అధికారులు మట్టి తవ్వకాల స్థలానికి వెళ్లి పనులను నిలిపివేశారు. రాబోయే రోజుల్లో కూడా మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలను చేపట్టరాదని తహసీల్దారు తెలిపారు.

కామ్రేడ్ లింగమూర్తి సంస్మరణసభ నేడు

కడప నాగరాజుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూర్జహాన్ కల్యాణ మండపంలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేనత కామ్రేడ్ లింగమూర్తి సంస్మరణ సభను నిర్వహించనున్నామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పులివెందుల తాలుకా లింగాల వాసి లింగమూర్తి విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులయ్యారని, రైతుసంఘాల తొలితరం నేతలైన గజ్జల మల్లారెడ్డి, తోట వెంకటరెడ్డి, కేవీ నాగిరెడ్డి, ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి శివరామిరెడ్డితో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. 60 ఏళ్లు ఎర్రజెండా నీడలో పనిచేసిన కామ్రేడ్ లింగమూర్తిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. ఈ సభకు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, కమ్యూనిస్టు నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజర వుతున్నారని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలి : ఆర్డీఓ

బద్వేలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని ఆర్డీఓ చంద్రమోహన్ పేర్కొన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో బద్వేలు, గోపవరం తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపాలిటీ లోని పురపాలక సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు రెవెన్యూ డివిజన్‌లో భూముల అన్యాక్రాంతం అధికమైందని వీటికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఉందని సూచించారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంలో ప్రభుత్వ సిబ్బంది పాత్ర ఉన్నట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో భూములు, చెరువులు, కుంటలు, పోరంబోకు, హౌసింగ్ లే అవుట్ స్థలాల అడ్డుకట్టకు ప్రతి అధికారి నిబద్ధతతో కృషిచేయాలన్నారు. ఈ ఆక్రమణలు రోడ్డు మధ్య, ముందుకు రేకులు వేయడం లాంటి ఆక్రమణలు అధికమవుతున్నాయని అలాంటి వాటిని గుర్తించి చట్టపర చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బద్వేలు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జీవశాస్త్ర అధ్యాపకులకు ఒక రోజు శిక్షణ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవశాస్త్ర అధ్యాపకులకు కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో 26న ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ వై.మీనాక్షి పేర్కొన్నారు. జంతు శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో బీబీసీ శార్ప్‌స్టేటస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞతను పెంపొందించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అట్లూరు, బద్వేలు, సీకేదిన్నె, చెన్నూరు, గోపవరం, కమలాపురం, ఖాజీపేట, సిద్దవటం, వల్లూరు, ఒంటిమిట్ట మండలాల్లోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆమె శనివారం ఒక ప్రకటనలో కోరారు.

చోరీ కేసులో 8 మంది అరెస్టు

కడప క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం ఎరువుల గోడౌన్‌లో ఎరువులు, రసాయన మందులు చోరీ చేసిన 8 మందిని అరెస్టు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కడపకు చెందిన ఉపేంద్ర, దిలీప్, రాజశేఖర్, సాయి, రాజేశ్, నరసింహ, సతీష్, చైతన్య ఈ నెల 20న రాత్రి గోడౌన్ తాళాలు పగలగొట్టి అందులో ఉన్న ఎరువులు సంబంధిత రసాయనిక మందులు చోరీ చేసినట్లు తెలి పారు. గోడౌన్ యజమాని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ సీతారామిరెడ్డి ఆదేశాలపై శనివారం నిందితులను అరెస్టు చేసి లక్ష రూపాయలు విలువైన ఎరువులు, రసాయన మందులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కుమార్తె కనిపించలేదంటూ ఫిర్యాదు



చెన్నూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్నమాచుపల్లెకు చెందిన మారెళ్ల పూజ (16) 22వతేదీ శుక్రవారం నుంచి కనిపించలేదంటూ బాలిక తండ్రి మారెళ్ల రాజా శనివారం చెన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కూతురును రెండురోజుల కిందట మందలించడంతో ఆమె ఇంట్లో చెప్పకుండా శుక్రవారం మధ్యాహ్నం వెళ్లిపోయింది. చుట్టుపక్కల బంధువుల వద్ద విచారించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కడపలో మహిళ....

కడప క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సరోజినీనగర్‌కు చెందిన మహిళ అదృశ్యమైనట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఆయన వివరాల మేరకు సరోజినీనగర్‌కు చెందిన మేరీ సుజాత నెల 13న ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. బంధువులు ఇళ్లల్లో విచారించగా ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

జాతీయ పోటీలకు వీరేశ్ ఎంపిక

కమలాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాలకు చెందిన వీరేశ్ ఖోఖో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 4 నుంచి 6 వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 25 నుంచి 29వరకు ఉత్తర ప్రదేశ్‌లోని అలిగఢ్‌లో జరిగే 43వ జూనియర్ నేషనల్ ఖోఖో ఛాంపియన్‌షిప్ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమణారెడ్డి, వీరేశ్ అభినందించారు.

యువ ఉత్సవ్ పోటీలకు ఆహ్వానం

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయి గ్రేస్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ యువతకు పిలుపునిచ్చారు. రాయచోటిలోని భాస్కర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల చివరి వారంలో యువ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'ఇండియా అండ్-2047' అంశంపై పెయింటింగ్, కవిత్వం, వ్యాసరచన, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లమేషన్, ఫోక్ డాన్స్ (గ్రూప్) విభాగాల్లో వ్యక్తిగత పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్ గ్రూప్, వ్యక్తిగత పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్ గ్రూప్, వ్యక్తిగత పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీలు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహిస్తారని, ఆయా స్థాయిల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. అన్నమయ్య జిల్లాలో 15 నుంచి 29 ఏళ్ల లోపున్న యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. వివరాలకు స్టెప్ మేనేజర్ 9949298810, 8008819556 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

పంట కోత ప్రయోగాలు పక్కాగా నిర్వహించాలి



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జేడీఏ చంద్రానాయక్

గాలివీడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పంటకోత ప్రయోగాలు పక్కాగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. శనివారం మండలంలోని నూలివీడు గ్రామంలో వరిలో పంటకోత ప్రయోగాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన, ప్రణాళికశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన సమయంలోగా ప్రయోగాలు పూర్తి చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి రమణారెడ్డి, జేడీఏ కార్యాలయం టెక్నికల్ ఏవో రమేశ్‌రాజు, మండల అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ శిక్షణ ప్రారంభం

రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రంలో ఈ నెల 21వ తేదీ నుంచి 5 రోజుల పాటు జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శిక్షణ తరగతులను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రకృతి వ్యవసాం చేస్తున్న రైతులందరూ తప్పకుండా ఈ పంటలో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే బీడు భూముల్లో ప్రకృతి వ్యవసాయ కరువు నివారణ మోడల్‌ను అవలంబించాలన్నారు. ఎంటీ యూనిట్ ఇన్‌చార్జి, ఐసీఆర్‌పీ, డీపీఎం, ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల అక్రమ వసూళ్లపై విచారణ

ఒంటిమిట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గ్యాస్ సిలిండర్లపై అధిక ధర వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సౌజన్య, ఏఎస్‌వో తారకనాథ్‌రెడ్డి శనివారం విచారణ చేశారు. రూ. 853కు గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాల్సిన ఏజెన్సీ నిర్వాహకులు 900 నుంచి 950 రూపాయలు వసూలు చేస్తున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని విచారణలో తేలడంతో ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు వివరించారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

సంబేపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కలిగించడం కోసం సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఎన్నికల విధివిధానాలు, ఓట్లలో రకాలు, ఓటు హక్కు వినియోగం, పోలింగ్ ప్రక్రియపై 9,10 తరగతుల విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఉపాధ్యాయులు ఆర్‌వోలుగా, పీవోలుగా, విద్యార్థులు ఏపీవోలుగా, ఓపీవోలుగా విధులు నిర్వర్తించారు. నామినేషన్ వేయడం, విత్‌డ్రా చేసుకోవడం, ఓటింగ్ మొదలైన ఎన్నికల విధులు విద్యార్థులు నిర్వహించారు.

'అన్నమాచార్య'కు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్

రాజంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ వచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు. ఈసందర్భంగా. కళాశాల వ్యవస్థాపకుడు చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలకు న్యాక్ ఏప్లస్ గ్రేడ్ రావడం గొప్ప విజయమన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి తమ కళాశాలలో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

వీఆర్‌ఏని దూషించినందుకు కేసు నమోదు

ఒంటిమిట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏని దూషించిన ఇబ్రహీంపేటకు చెందిన సుధాకర్ అనే వ్యక్తిపై ఒంటిమిట్ట పోలీసులు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో ఉండగా తనను కులం పేరుతో దూషించాడని తహసీల్దారు రమణమ్మతో కలసి వీఆర్‌ఏ శాంతమ్మ ఎస్ఐ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేసి నిందితుడిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

పక్కా గృహాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పక్కా గృహాలు పొందేందుకు ఈ నెల 25 నుంచి దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ కేఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకు ముందు హౌసింగ్ పథకం కింద ప్రభుత్వ ఇంటి పట్టా ఇచ్చినా, ఆన్‌లైన్ కాని వారు గ్రామాల్లో సొంత స్థలం ఉన్న వారు, ఓన్ సైట్ పథకం కింద ఇళ్లు కట్టుకొనుటకు పీఎంఏవై2.0 స్కీం కింద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగినవారు ఆన్‌లైన్ చేసిన సర్టిఫికెట్లను స్థానిక హౌసింగ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇంటికి సంబంధించిన వివరాలు, భార్యాభర్తల ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డు, కులం, ఆదాయం, సర్టిఫికెట్ బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్, ప్రధాన మంత్రి జనధన్ అకౌంట్ ఫొటోస్టాట్ కాపీలు కార్యాలయంలో సమర్పించాలన్నారు.

40 కుటుంబాలు టీడీపీలో చేరిక



మైనార్టీలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

సుండుపల్లె,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు టీడీపీలోకి చేరినట్లు ఆ పార్టీ రాజంపేట ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనను మెచ్చి రాయవరానికి చెందిన సయ్యద్ ఫాజిల్‌తో పాటు 40 మైనార్టీ కుటుంబాలు పార్టీలో చేరడం సంతోషదాయకమన్నారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు చప్పిడి రమేశ్ నాయుడు, యూనియన్ బాషా, మేకల మహబూబ్ బాషా, ఆనంద్ నాయక్, సయ్యద్ ఫజిల్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపండి..

రాయచోటిటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజలకు గుదిబండగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ భారం మోపే ఆలోచనలు మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన సీపీఐ, ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ హయాంలో పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకించిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ప్రస్తుతం తామూ అదే పని చేస్తున్నాయని ఆరోపించారు. ఏ భారం ఉండదని పైకి చెప్తున్నా ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తిదారులకు దోచి పెట్టడం తోపాటు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను దశలవారీగా తొలగిం చేందుకే ఈ విధానాన్ని తీసుకువచ్చారన్నారు. జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సిద్దిగాళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాజుల కాలనీకి వెలిగల్లు నీరివ్వాలి

రాయచోటిటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీతోపాటు, రాజులకాలనీకి వెలిగల్లు నుంచి తాగునీరు సరఫరా చేయాలని అన్నమయ్య జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు, రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం రాజులకాలనీ మహిళలతో కలిసి వెలిగల్లు పైపులైను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడేళ్లుగా 100 కుటుంబాల ప్రజలు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. మున్సిపాలిటీకి నడిబొడ్డున ఉన్న చెన్నముక్కపల్లె గ్రామ పంచాయతీని మున్సిపాలిటీలో కలిపి తాగునీటితో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో కలెక్టరేట్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఇమ్రాన్, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

వీరబల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి కొండయ్య తెలిపారు. శనివారం స్థానిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. వార్డులో పేషెంట్లను పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వైద్యశాలకు సంబంధించిన రికార్డులను, మందులను పరిశీలించారు.

వైసీపీ నేతతో రూపానందరెడ్డి చర్చలు

పెనగలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలానికి చెందిన వైసీపీ నాయకుడు బీఎల్ నరసింహారెడ్డితో శనివారం సాయంత్రం ఇండ్లూరులోని ఆయన నివాసంలో అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సమావేశమయ్యారు. సోమవారం ఉదయం 10 గంటల తర్వాత నరసింహారెడ్డి, ఆయన అనుచరులను రూపానందరెడి టీడీపీలోకి ఆహ్వానించనున్నారు. ఈ సందర్భంగా విందు ఏర్పాటు చేసినట్లు నరసింహారెడ్డి అనుచరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, జిల్లా మండల నాయకులు భారీగా పాల్గొన్నారు.

మహారాష్ట్రలో బీజేపీ విజయంపై సంబరాలు



సాయిలోకేష్‌కు మిఠాయి తినిపిస్తున్న నాగోతు రమేష్ నాయుడు

రాజంపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ ఆధ్వర్యంలో రాజంపేటలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కూటమి ఎన్ని కుట్రలు చేసినా మహారాష్ట్ర ప్రజలు నరేంద్రమోదీకి నీరాజనాలు పలికారన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగోతు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో మన్నూరులోని పార్టీ కార్యాలయం నుంచి పాతబస్టాండు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కూడలిలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. సుండుపల్లె, ఒంటిమిట్ట, నందలూరు మండలాల్లో ఆయా ప్రాంతాల నాయకులు సంబరాలు చేసుకున్నారు.

పన్ను వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు పన్ను, పన్నేతర వివరాలను స్వర్ణ పంచాయతీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో పొందుపర్చాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందులో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి శనివారం రాయచోటి మండలంలోని డీ. అబ్బ వరం, చెన్నముక్కపల్లె గ్రామ పంచాయతీలను సందర్శించి డేటా ఎంట్రీపై సూచనలిచ్చారు. ఈ నెల 30 లోగా డేటా ఎంట్రీ పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు, పంచాయతీ సెక్రటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటం పోలీసు స్టేషన్ తనిఖీ

సిద్దవటం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను శనివారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చిత ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఐ కృష్ణంరాజునాయక్, సిద్దవటం, ఒంటిమిట్ట ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటిస్థలాల కోసం ఉపాధ్యాయుల వినతి

పుల్లంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ మండలంలో పనిచేసే ఉపాధ్యాయులు శనివారం అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డికి విన్నవించుకున్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. నాయకులు కె.రామకృష్ణయ్య, ఎస్.ఉమామహేశ్వర్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్వరైజింగ్ మిల్లులను ఆదుకోవాలి

రైల్వేకోడూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తగినంత ముగ్గురాయి ఇవ్వకుంటే మిల్లుల భవిత ప్రశ్నార్థకంగా మారుతుందని పల్వరైజింగ్ మిల్లు యజమానుల అసోషియేషన్ అధ్యక్షుడు మాచినేని విశ్వేశ్వరనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రైల్వేకోడూరు పట్టణంలోని తేజ కల్యాణ మండపంలో పల్వరైజింగ్ మిల్లుల యజమానుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతి నెల ప్రతి మిల్లుకు ఏ-గ్రేడు 900 టన్నులు, బీ-గ్రేడు 1000 టన్నుల ముగ్గురాయిని ఇచ్చేవారని, . ప్రస్తుతం ఏ-గ్రేడు 110 టన్నులు, బీ-గ్రేడు 290 టన్నులు మాత్రమే ఇవ్వనున్నట్లు తెలియడంతో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్, కార్యదర్శి, రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లురవీంద్రను కలసి విన్నవించామన్నారు. మునుపటి మాదిరిగానే ముగ్గురాయిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పల్వరైజింగ్ మిల్లుల యజమానులు, అసోషియేషన్ ప్రతినిధులు అతికారి శివరాయుడు, కల్లా చలపతి, గల్లా శ్రీనివాసులు, నారాయణరెడ్డి, తల్లెం వెంకటరమణా రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా పెంచాలి

ఒంటిమిట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా పెంచాలని ఇన్‌చార్జి డీఎఫ్‌వో దివాకర్ అన్నారు. శనివారం మండలంలోని కుడమలూరు గ్రామంలో ఎకో టూరిజం పార్కు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం బేస్ క్యాంపులు, వన్యప్రాణుల సంరక్షణపై ఆరా తీశారు. వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, తాగునీటి కుంటలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అటవీశాఖ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, బేస్ క్యాంపుల్లోని తుపాకులను పరిశీలించారు. సిబ్బంది అడవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో వివేకానంద, ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో బాలసుబ్రమణ్యం, ఎఫ్ఎస్‌వో బ్రహ్మయ్య, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

● పోలీసు అధికారుల సమావేశంలో జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్ కుట్టి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం రాయచోటి కోర్టులో పోలీసు అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో కేసులు వచ్చే విధంగా చూడాలన్నారు. క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్, సీసీ తదితర కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జీసీ ఆసిఫా సుల్తానా, రాయచోటి రూరల్, అర్బన్ సీఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ విశ్వనాథ రెడ్డి, ఎస్ఐలు నరసింహారెడ్డి, శ్రీనివాసులు, భక్తవత్సలం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హద్దుల ఏర్పాటు

సిద్దవటం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వెలుగుపల్లె రెవె న్యూ గ్రామం ఎస్సీ కాలనీలోని రామాలయానికి కేటాయించిన 20 సెంట్ల భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దారు మాధవీలత విచారణకు ఆదేశించారు. దీంతో వీఆర్వో కేశవులు శనివారం సర్వే నెంబరు 53లోని ఆ స్థలాన్ని సర్వే చేయించి ఆక్ర మణలు తొలగించి హద్దులు ఏర్పాటు చేశారు. సచివాలయ సర్వేయర్ పురుషోత్తమరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రైల్వేకోడూరు, నవంబరు 23: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బలక్ష్మి, నిర్మల తెలిపారు. శనివారం రైల్వేకోడూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలతో బాలికల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. బాల్య వివాహా లకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలని అంగన్వాడీ కార్యకర్తలకు తెలిపారు. నా కుటుంబం, నా పరిసరాలు, నా గ్రామం, నా సమాజం అనుకుంటూ బాల్య వివాహాలు జరగకుండా చూడాలని తెలిపారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సమాచారం అందించాలన్నారు. బాలల విద్య, భద్రత కోసం అందరూ ముమ్మరంగా కృషి చేయాలని తెలిపారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ సాకారానికి మద్దతు ఇవ్వాలని కోరారు.



బృహత్ శిలాయుగం నాటి సమాధులు ఉన్న శేషాచలకొండలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

వేల ఏళ్ల.. ఆనవాళ్లు

శేషాచలంలో ప్రాచీన మానవ జీవనానికి సాక్ష్యాలు

చుట్టూ దట్టమైన అడవి. ఆ అడవి మధ్య పద్ధతి ప్రకారం అమర్చిన రాళ్లు. నాలుగు రాళ్లను నిలిపి.. వాటిపైన మూతగా ఓ పెద్ద బండ. అలా పెట్టిన కొన్ని రాళ్ల చుట్టూ.. తామరపూల ఆకారంలో నిలువుగా అమర్చిన బండరాళ్లు. అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం రాయవరం గ్రామం దేవవాండ్లపల్లె సమీపంలోని ఎర్రకొండల్లో ఇటువంటి నిర్మాణాలున్నాయి. ఆ బండరాళ్ల వెనుక మూడువేల సంవత్సరాలకు పూర్వం మనుషుల జీవన విధానాన్ని తెలిపే చరిత్ర ఉంది. ఆదిమ మానవుడు రాతియుగం నుంచి అభివృద్ధి చెందుతూ.. ఇనుమును వినియోగించిన కాలం (బృహత్ శిలాయుగం) నాటి చరిత్ర అది. అప్పట్లోనే ఇక్కడ జీవించిన మానవులు తమ సమాధులను ఎలా నిర్మించారో నేటి తరానికి తెలియజేసే ఆనవాళ్లే ఆ పెద్దపెద్ద రాతి నిర్మాణాలు. ప్రస్తుతం వీటి ఆలనాపాలనా చూసేవారు లేక.. ప్రభుత్వాలు పట్టించుకోక.. గుప్తనిధులు ఉంటాయేమోననే కొందరి దురాశ కారణంగా.. ఆ నిర్మాణాలు ధ్వంసమై శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

నాలుగు ఎకరాల్లో.. 50 నిర్మాణాలు

అన్నమయ్య జిల్లాకు ఎంతో ప్రాచీన చరిత్ర, సంస్కృతి ఉన్నాయనడానికి ఈ రాతి నిర్మాణాలే నిదర్శనం. దేవవాండ్లపల్లెకు ఉత్తర దిశలో దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలోని శేషాచలకొండల్లోని ఎర్రకొండల్లో ఈ నిర్మాణాలు ఉన్నాయి. పురావస్తు పరిశోధకుల ప్రకారం.. ఇక్కడి రాతి నిర్మాణాలు మూడు వేల ఏళ్ల క్రితం బృహత్ శిలాయుగంలో మరణించిన మనుషుల సమాధులు. అవి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం అన్నీకలిపి 50 వరకు ఉన్నాయి. పూర్వ కాలంలో ఎవరైనా మరణిస్తే.. ప్రత్యేక పద్ధతిలో పెద్దపెద్ద బండరాళ్లను ఉపయోగించి సమాధులు నిర్మించే వారు. సాధారణంగా సమాధుల్లో డాల్‌మెన్స్, స్టోన్ సర్కిల్స్, మెన్‌హిర్స్, సిస్ట్‌బరియల్స్ డాల్‌మెనాయిడ్ సిస్ట్స్ అనే రకాలు ఉంటాయి. దేవవాండ్లపల్లెలోని సమాధులు.. డాల్‌మెన్స్ రకానికి చెందినవి. వీటి నిర్మాణానికి ఆర్కియన్ యుగపు గ్రానైట్ రాయిని ఉపయోగించారు. ఈ సమాధుల్లో మృతదేహంతో పాటు.. ఇనుప పరికరాలు, మట్టి పాత్రలు వేసి పూడ్చేవారు. సమాధుల లోపలి బండలపై ఆనాటి కాలంలో చిత్రించిన తెలుపు రంగులో ఏనుగు, ఏనుగుపై సవారీ చేస్తున్న మనిషి, తాబేళ్లు, డైనోసార్స్‌ను పోలిన రేఖాచిత్రాలు ఉన్నాయి. సమాధుల వద్దకు అడవి జంతువులు వెళ్లడానికి వీలు లేకుండా వాటి చుట్టూ తామరపూవు ఆకారంలో 10నుంచి 15 అడుగుల ఎత్తు ఉన్న పెద్దపెద్ద బండరాళ్లు నిలబెట్టారు. ఈ నిర్మాణాలకు సమీపంలోనే ఉన్న మరో గుట్టపైన శ్లాబ్స్ ఉన్న డాల్‌మెన్స్ ఉన్నాయి.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

వేల సంవత్సరాల నాటి ఈ బృహత్ శిలాయుగపు సమాధులు ఉన్న ప్రాంతాన్ని ఇప్పటికైనా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఇవి ఉన్నచోటుకు చేరుకోవాలంటే అడవిలో చాలా దూరం నడవాల్సి ఉంటుంది. అయితే ఈ సమాధులకు ఉన్న చరిత్ర, ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే.. పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చి చారిత్రక విశేషాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఈ రాతి సమాధులు ఉన్న ప్రాంతం చుట్టూ కంచె ఏర్పాటు చేసి వాటిని రక్షిస్తే.. భవిష్యత్తు తరాలకు భద్రంగా అందించే అవకాశం ఉంటుంది.

అన్నమయ్య జిల్లాలో బృహత్ శిలాయుగం నాటి సమాధులు

- 1914లోనే వీటిని గుర్తించిన ఆంగ్లేయుడు రాబర్ట్ ఫూటే
- పాండవుల గుళ్లుగా పిలుస్తున్న స్థానిక ప్రజలు
- బండలపై ఆ కాలం నాటి అపురూప రేఖాచిత్రాలు
- పట్టించుకునేవాళ్లులేక ఛిద్రమవుతున్న చారిత్రక సంపద
- ప్రభుత్వం చొరవ చూపితే పర్యాటక కేంద్రంగా మారే అవకాశం

దక్షిణ భారతదేశంలో ఎక్కువ

ప్రాచీన కాలంలో రాతి సమాధుల సంస్కృతి దక్షిణ భారతదేశంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అలాంటి సమాధులు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. ఈశాన్య భారతంలో కూడా కొన్ని చోట్ల ఉన్నాయి. ఉత్తర భారతదేశంలో మాత్రం ఇలాంటి సమాధులు కనిపించవు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా రాయలసీమలోనే ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో ఉన్న వాటిలో దేవవాండ్లపల్లె వద్ద ఉన్నవే పెద్దవి కావడం విశేషం. సుండుపల్లె మండలం మడితాడు గ్రామం పడమర వైపు చెన్నకేశవ స్వామి దేవస్థానం వెనుక వైపు ఉన్న గుట్టల్లోనూ.. ఇటువంటి రాతి సమాధులు సుమారు 20 వరకు ఉన్నాయి. సంబేపల్లె మండలంలోనూ అక్కడక్కడా కనిపిస్తాయి. చిత్తూరు జిల్లాలోనూ.. ఇటువంటివి పలుచోట్ల ఉన్నాయి. దక్షిణ కర్ణాటక మూడ్‌బిదిరి ప్రాంతంలో.. అచ్చం దేవవాండ్లపల్లెలో ఉన్నట్లే సమాధుల నిర్మాణాలు ఉన్నాయి. అయితే ఎక్కువగా సమాధులు ఉన్నది మాత్రం సుండుపల్లె మండలంలో మాత్రమే. అయితే వీటిలో పాండవులు అజ్ఞాతవాస కాలంలో నివసించారని.. కడప, చిత్తూరు జిల్లా ప్రజల విశ్వాసం. దీంతో వీటిని ఈ జిల్లాల్లో పాండవుల గుళ్లుగా పిలుస్తారు. దేవవాండ్లపల్లె ప్రజలు వీటిని పాండురాజు గుళ్లు అంటారు. ఇలాంటి సమాధుల్లో రాక్షసులు నివసించారని భావించే కర్నూలు, ప్రకాశం జిల్లాల ప్రజలు వీటిని రాక్షస గుళ్లు అని పిలుస్తారు.



మరో బండపై చతురస్రాకారంలో ఉన్న నిర్మాణాలు

అపురూపమైన చారిత్రక సంపద



ఈ కట్టడాలు బృహత్ శిలాయుగం నాటి మానవుల సమాధులు. గతంలో పరిశోధనలు చేసిన వారు ఇవి దాదాపు 3 వేల ఏళ్లనాటివి అని చెప్పారు. అయితే ఇటీవల హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ వారు.. ఇలాంటి సమాధుల్లో దొరికిన వాటిని అధునాతన పద్ధతుల్లో పరిశీలించి ఇవి దాదాపు 4,400 ఏళ్లనాటివని తేల్చారు. ఈ సమాధుల బండలపైన రాళ్లను పిండిచేసి అందులో ఆకుపసరులు కలిపి నాటి మానవులు బొమ్మలు గీశారు. ఇవి సహజమైన రంగులు కావడంతో ఇప్పటికీ చెరిగిపోకుండా ఉన్నాయి. ఇలాంటివి దక్షిణ భారతదేశంలో.. ముఖ్యంగా రాయలసీమలో ఎక్కువగా ఉన్నాయి. ఈ నిర్మాణాల్లో నిధులేవీ ఉండవు. కొందరు ఈ బండలను పొలాలకు కంచెలకు, ఇళ్లకు వాడుకుంటున్నారు. ఇవి అపురూపమైన చారిత్రక సంపద. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ముఖ్యంగా పురావస్తుశాఖ, రెవెన్యూ వారు వీటిని పరిరక్షించాల్సి ఉంది.

– జాదవ్ విజయకుమార్, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్, పురావస్తుశాఖ

1914లో వెలుగులోకి..

ఈ సమాధులను మొట్టమొదట 1914లో గుర్తించారు. అప్పటి బ్రిటిష్ పాలనలో రాబర్ట్ బ్రూస్ ఫూటే అనే ఆంగ్లేయుడు వీటిని మొదటిసారిగా గుర్తించాడు. ఈ మేరకు 'ది ఫూటే కలెక్షన్ ఆఫ్ ఇండియన్ ప్రి-హిస్టారిక్ అండ్ ప్రోటో-హిస్టారిక్ యాంటిక్విటీస్ కేటలాగ్ రైజాన్ బై మద్రాస్ గవర్నమెంట్ ప్రెస్'లో రికార్డయింది. అనంతరం వీటిని ఎవ్వరూ పట్టించుకోలేదు. దాదాపు ఎనిమిదేళ్ల క్రితం చరిత్రకారులు కొందరు ఇక్కడికి వెళ్లి వీటిని పరిశీలించారు. అయినా ఇవి పెద్దగా వెలుగులోకి రాలేదు.



శేషాచలకొండల్లోని ఎర్రకొండలో ఒక పెద్ద బండపై తామరపూవు ఆకారంలో ఉన్న రాతికట్టడాలు (సమాధులు)

హార్సిలీహిల్స్‌లో అభివృద్ధి పనులు

- డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్



హార్సిలీహిల్స్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

బి.కొత్తకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్‌లోని అటవీ ప్రాంగణంలో పర్యాటకులను ఆకర్షించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి జగన్నాథ్‌సింగ్ తెలిపారు. శనివారం ఆయన బి.కొత్తకోట మండల పరిధిలోని హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. ఇటీవల రూ.10 లక్షలతో ఆధునీకరించిన అతిథిగృహంతో పాటు, ప్రస్తుతం రూ.20 లక్షలతో నిర్మిస్తున్న మరో అతిథిగృహం పనులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిల్స్‌పై అటవీశాఖ ప్రాంగణంలోని మానససరోవరంలో బోటింగ్ పర్యాటకులను బాగా ఆకర్షిస్తోందని, పర్యాటకుల భద్రతతో పాటు, అతిథి గృహాల అద్దెలను రీజనబుల్‌గా వసూలు చేస్తున్నామన్నారు. జూపార్క్‌లతో పాటు ప్రతిపాదనలు పంపిన పలు అభివృద్ధి కార్యక్రమాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

అడవి పంది మాంసం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

పెద్దతిప్పసముద్రం నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అడవి పంది మాంసాన్ని గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్న ముగ్గురిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ములకలచెరువు ఫారెస్ట్ రేంజ్ సెక్షన్ అధికారి షబీన్‌తాజ్, ఫారెస్ట్ బీట్ అధికారి ప్రకాష్‌కుమార్‌లు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రం మండలం రాపూరివాండ్లపల్లె పంచాయతీ కాయలవాండ్లపల్లెకు చెందిన శ్రీరాములు, రెడ్డెప్ప, జయచంద్ర అనే ముగ్గురు అడవి పంది మాంసాన్ని విక్రయిస్తున్నారన్న సమాచారంతో కాయలవాండ్లపల్లెకు చేరుకుని వారు విక్రయిస్తున్న అడవి పంది మాంసంతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకుని ములకలచెరువు అటవీశాఖకు సంబంధించిన స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు వారిని ములకలచెరువులోని అటవీశాఖ స్టేషన్‌లో ఉంచినట్లు తెలిపారు.

ప్యాసింజర్ రైళ్లకు కొత్త నెంబర్లు కేటాయింపు



ములకలచెరువు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్లకు రైల్వేశాఖ కొత్త నెంబర్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మారిన రైళ్ల నెంబర్లు జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని ప్రకటించింది. తిరుపతి-గుంతకల్లు-కదరిదేవరపల్లెకు రాత్రి, ఉదయం నడిచే నాలుగు రైళ్ల నెంబర్లు మారాయి.

ప్యాసింజర్ రైలు	పాత నెంబరు	కొత్త నెంబరు
1) తిరుపతి-గుంతకల్లు (ఉదయం)	07656	57403
2) గుంతకల్లు-తిరుపతి (ఉదయం)	07655	57404
3) తిరుపతి-కదరిదేవరపల్లె (రాత్రి)	07589	57405
4) కదరిదేవరపల్లె-తిరుపతి (రాతి)	07590	57406

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య



స్వాతి మృతదేహం

మదనపల్లె అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మదనపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం ఫైర్‌స్టేషన్ పక్కన శేషమహల్‌కు వెళ్లేవీధిలో కాపురం ఉన్న నరేష్ భార్య జి.స్వాతి బాత్‌రూమ్‌లో తాడుతో ఉరి వేసుకొని మృతి చెందింది. గమనించిన స్థానికులు వెంటనే వన టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి మహిళను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సిఉంది. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఎరిషావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



బాలగంగాధర్‌నాయుడు, శివ

గాలివీడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎగువగొట్టివీడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు బాలగంగాధర్ నాయుడు, కె.శివ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కవారిపల్లె, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో తమ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సిద్దవటం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సిద్దవటం పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని గాండ్లపాలెం వద్ద పెన్నానది నుంచి బద్వేల్‌కు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఆ వాహనాలను తహసీల్దారుకు అప్పజెబుతామన్నారు. గృహనిర్మాణాలకు మాత్రమే ఉచితంగా ఇసుక రవాణా చేయాలని, దూర ప్రాంతాలకు ఇసుక రవాణా చేయరాదని ఎస్‌ఐ తెలియజేశారు.

విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురిపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురిపై కేసు నమోదైంది. పీటీఎం ఎస్‌ఐ నరసింహుడు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నవాబుకోట పంచాయతీ వరికసువుపల్లెకు చెందిన బయ్యారెడ్డి అనే వ్యక్తి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా వరికసువుపల్లె సమీపంలోని తుమ్మరకుంట రెవిన్యూ సరిహద్దులో ప్రభుత్వ భూమిలో దహనక్రియలను చేసేందుకు ఆయన కుటుంబీకులు యత్నించారు. దీంతో సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీరాములు నాయక్ తమ సిబ్బందితో కలసి అక్కడికి చేరుకుని దానిని అడ్డుకున్నారు. దీంతో వారిపై మృతుడి కుటుంబ సభ్యులు దౌర్జన్యానికి దిగారు. తమ విధులకు ఆటంకం కలిగించి దౌర్జన్యం చేశారని వరికసువుపల్లె గ్రామానికి చెందిన ఏడుగురిపై పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టౌన్‌బ్యాంకు నామినేషన్లన్నీ సక్రమమే

- స్ర్కూటినీ పూర్తి



నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

మదనపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం స్క్రూటినీ పూర్తి చేశారు. శుక్రవారం 12 మంది అభ్యర్థులు దాఖలు చేసిన అన్ని నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ ప్రకటించారు. ఇందులో భాగంగా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు చైర్మన్ అభ్యర్థి నాదెళ్ల విద్యాసాగర్‌తో పాటు ఆయన ప్యానల్‌లోని నిమ్మనపల్లె ముక్తియార్‌ఖాన్, సూరె రవీంద్రనాథ్, సవరం భాస్కర్‌కుమార్, రాటకొండ సోమశేఖర్, దిగువపాళెం నిరంజన్‌కుమార్, నాదెళ్ల వెంకటేశ్వరప్రసాద్, శ్రీరామ రవికాంత్‌బాబు, రామిశెట్టి భాస్కర్, ఆకుల కృష్ణమూర్తి, పఠాన్ సర్దార్‌ఖాన్, జోళపాళెం కృష్ణమూర్తి దేవేంద్రబాబులు హాజరయ్యారు. ఎన్నికల అధికారులు ఒక్కొక్కరిని పిలుస్తూ వారి ముందు నామినేషన్‌ను నిశితంగా పరిశీలించారు. ఇలా 12 మంది నామినేషన్లను పరిశీలించిన దుర్గమ్మ అంతా ఒకే అంటూ ప్రకటించడంతో అటు అధికారులు, ఇటు అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. అయితే పోటీలోని అభ్యర్థులందరూ ఒక్కొక్కటే నామినేషన్ దాఖలు చేయడం, పైగా నిబంధనల ప్రకారం ప్యానల్‌లోని సంఖ్యకు సరిపడా అభ్యర్థులే పోటీపడటంతో నామినేషన్ల ఉపసంహరణ అనే మాట ఉండదు.

తర్వాత ఎన్నికల క్రతువులో పోటీలోని అభ్యర్థులను ఎన్నికల అధికారి దుర్గమ్మ అధికారికంగా ప్రకటించడం, వారి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు బ్యాంకు ప్రధాన కార్యాలయంలో చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నిక జరగనుంది. ఇందులో చైర్మన్‌గా నాదెళ్ల విద్యాసాగర్, వైస్‌చైర్మన్‌గా ఎస్.భాస్కర్‌కుమార్‌లను ఎన్నుకోనున్నారు.

పొట్టేళ్లపై చిరుతపులి దాడి



చిరుతపులి దాడిలో గాయపడిన పొట్టేళ్లు

నిమ్మనపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిరుతపులి నిత్యం ఏదో ఒక చోట మూగజీవాలపై దాడులు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. తాజాగా శనివారం మండలంలోని ముష్టూరు పంచాయతీ పారేసువారిపల్లికి చెందిన రైతు రాజగోపాల్ తన వ్యవసాయ పొలం వద్ద పొట్టేళ్లను మేపుకుంటుండగా చిరుతపులి పొట్టేళ్ల మందపై దాడి చేసి రెండు పొట్టేళ్లను పట్టుకుంది.

వెంటనే అక్కడే ఉన్న రైతు పెద్దగా అరవడంతో వాటిని వదిలి పారిపోయినట్లు తెలిపాడు. కాగా చిరుతపులి బోడి కొండ, చలిమామిడికొండ ప్రాంతాలలో తిరుగుతూ కనిపించిన మూగజీవాలను చంపుతోంది. నాలుగు చిరుతలు వాటి పిల్లలు కూడా ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో అటవీ ప్రాంత సమీపంలో ఉన్న పొలాల వద్దకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు చిఉతపులిని పట్టుకొని మూగజీవాలతో పాటు మనుషుల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పీలేరులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పర్యటన



వంటశాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మజ

పీలేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీఎస్ పద్మజ శనివారం పీలేరులో విస్తృత పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా ఆమె శనివారం స్థానిక ఆయిల్ సీడ్స్‌లోని బాలికల గురుకులం, చిత్తూరు మార్గంలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకులం, కోర్టు ప్రాంగణాలు, సబ్‌జైలును సందర్శించారు. గురుకులాల్లో బాలికలతో మాట్లాడారు. అక్కడ విద్యార్థినులకు అందుతున్న భోజన సదుపాయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ సీడ్స్‌లోని గురుకులంలో వంట శాల నిర్వహణ బాగోలేదని, దానిని సరిజేసుకోవాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతున్నాదా లేదా అంటూ సబ్‌జైలులోని ఖైదీలను ఆరా తీశారు. శిక్ష అనుభవించిన అనంతరం ప్రవర్తనలో మార్పు రావాలని వారికి హితవు పలికారు. డిసెంబరు 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ సన్నాహకాల్లో భాగంగా పీలేరు కోర్టుల పరిధిలోని పోలీసు అధికారులు, న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కక్షిదారులకు లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని సూచించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పీలేరు సీనియర్ సివిల్ జడ్జి రవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీసీ పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగ పనుల్లో పురోగతి సాధించాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పల్లెపండుగ పనులు అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, నీటివసతి తదితర అంశాలపై కలెక్టర్ పంచాయతీరాజ్ శాఖ గ్రామీణ నీటి సరఫరా శాఖ, ఐసీడీఎస్ శాఖాధికారులు, సిబ్బంది, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లెపండుగ పనుల్లో పురోగతి సాధించాలని, వందశాతం పనులు గ్రౌండింగ్‌లో కావాలని ఎంపీడీవోలను, పంచాయతీరాజ్, డ్వామా శాఖల సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలను నిర్వహించి పురోగతి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఎస్‌ఈని, డ్వామా పీడీ ఆదేశించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నీటి వసతి ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారి ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల ఏర్పాటుపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి పురోగతి సాధించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈని, ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఎస్‌ఈ దయాకర్‌రెడ్డి, డ్వామా పీడీ వెంకటరత్నం, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గండి క్షేత్రంలో రామ్‌దిన్ అన్నదానం

అన్నదాత ఉత్తర్ ప్రదేశ్ వాసి



గండి క్షేత్రంలో అన్నం వడ్డిస్తున్న రామ్‌దిన్

చక్రాయపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామ్‌దిన్ అన్నదానం చేస్తున్నారంటే గండిలో ప్రత్యేకత సంతరించుకుంటుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన భారీఘాట్ బస్తీ వాసి రామ్‌దిన్ రామభక్తుడు. ఏటా కార్తీకమాసంలో గండి దేవస్థానంలో వేలాది మందికి అన్నదానం చేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శనివారం గండి క్షేత్రంలో 7వేల మందికి అన్నదానం గావించారు. పలు రకాల అన్నం, కూరలు, వడ, బజ్జీలు తదితర వాటిని భక్తులకు వడ్డించారు. ఉదయం 10గంటలకు ప్రారంభించి రాత్రి 8గంటల వరకు అడిగడిగి మరీ అన్నదానం చేశారు. కాగా ఇంకా మూడు అండాల అన్నం మిగిలిపోవడంతో అనాథాశ్రమాలకు తరలించారు. ఈయన దాతృత్వం ఇంతా అంతా కాదు. ప్రతి భక్తుడూ అన్నదాత సుఖీభవ అంటూ దీవించారు. ఏటా శనివారం దాదాపు రూ.2లక్షలకు పైబడి ఖర్చు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో గండి ఈఓ వెంకటసుబ్బయ్య, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, రామ్‌దిన్ బంధువులు, మిత్రులు పాల్గొన్నారు. మండలంలోని నాగులగుట్టపల్లె సమీపంలోని దశరథ మహారాజ ఆలయం వద్ద అయ్యప్పస్వాములకు అన్నదానం గావించారు.

అరుణాచలానికి బస్సు సౌకర్యం

పోరుమామిళ్ల,నవంబరు23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా అరుణాచలానికి బస్సు సౌకర్యం కలగజేస్తున్నట్లు బద్వేలు ఆర్టీసీ డీఎం తెలిపారు. ఆదివారం రాత్రి 7గంటలకు పోరుమామిళ్ల నుంచి నేరుగా అరుణాచలానికి బస్సు వెళుతుందని సోమవారం ఉదయం 5గంటలాకల్ల అరుణాచలం చేరి గిరిప్రదక్షిణ చేసిన తరువాత గోల్డెన్ టెంపుల్ కూడా సందర్శించవచ్చని తెలిపారు. అరుణాచలానికి వెళ్లేవారు 7981554538, 7382865220కి ఫోను చేయాలన్నారు. టికెట్ ఫోను ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. ఒక టికెట్‌కు రూ.1300 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నీ నేడు

కడప స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెల్లంమండీ వీధిలోని ఇంటర్‌నేషనల్ ఫంక్షన్ హాలులో ఆదివారం రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనీస్ దర్బారీ తెలిపారు. చెస్ అసోసియేసన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులందరికీ ఉచిత భోజన వసతి ఇసతి, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.
క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి

ప్రతి సంఘం ఆర్థికంగా బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఆనంద్‌నాయక్

కమలాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి డ్వాక్రా సంఘం ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత సంఘం సభ్యులపై ఉందని పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. శనివారం కమలాపురం మండల సమాఖ్య సమావేశ సభ భవనంలో సమాఖ్య ఓబీలు, ఈసీ మెంబర్స్, గ్రామ సమాఖ్య సహాయ సేవకురాళ్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ప్రాజెక్ట్ డైరెక్టరు ఆనంద్‌నాయక్ మాట్లాడుతూ మండల మహిళా మార్ట్ ఏర్పాటు గురించి సభ్యుల ఆర్థిక ఆదాయ జీవనోపాధి ప్రణాళిక సర్వే తదితర విషయాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. సీసీలను పని విధానంపై సమీక్ష చేయడం జరిగిందని తెలిపారు.

'క్రీడల్లో రాణించి ఉద్యోగాలు అందిపుచ్చుకోవాలి'



క్రీడాకారిణులతో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

కడప స్పోర్ట్స్ నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని విశ్రాంత స్టెప్ సీఈఓ డాక్టర్ రామచంద్రారెడ్డి యువ క్రీడాకారులకు సూచించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ఆధ్వర్యంలో శనివారం డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో కబడ్డీ పురుషుల, మహిళల జట్ల ఎంపికలు జరిగాయి. ఆయన ఔత్సాహిక మహిళా, పురుష క్రీడాకారులతో మాట్లాడుతూ క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేలా 2 శాతం వున్న రిజర్వేషన్లను 3 శాతానికి పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రతి క్రీడాకారుడూ వారు ఎంచుకున్న క్రీడా విభాగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ సెక్రటరీ శ్రీవాణి, డీఎస్ఏ కబడ్డీ కోచ్ శ్రీధర్, పీడీ సుబ్బన్న, లక్ష్మీశ్రీనాథ్, సుమారు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

జాతీయ పోటీలకు వీరేశ్ ఎంపిక

కమలాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాలకు చెందిన వీరేశ్ ఖోఖో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 4 నుంచి 6 వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 25 నుంచి 29వరకు ఉత్తరప్రదేశ్ అలిగఢ్‌లో జరిగే 43వ జూనియర్ నేషనల్ ఖోఖో ఛాంపియన్‌షిప్ జాతీయ పోటీలకు ఎంపికైన వీరేశ్‌ను కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమణారెడ్డి అభినందించారు.

యువ ఉత్సవ్ పోటీలకు ఆహ్వానం

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ ఒక ప్రకటనలో యువతకు పిలుపునిచ్చారు. రాయచోటిలోని భాస్కర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల చివరి వారంలో యువ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'ఇండియా అండ్-2047' అంశంపై పెయింటింగ్, కవిత్వం, వ్యాసరచన, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లమేషన్, ఫోక్ డాన్స్ (గ్రూప్) విభాగాల్లో వ్యక్తిగత పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్ గ్రూప్, వ్యక్తిగత పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్ గ్రూప్, వ్యక్తిగత పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీలు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహిస్తారని, ఆయా స్థాయిల్లో విజేతలకు బహుమతులు ఉంటాయన్నారు. జిల్లాలో 15 నుంచి 29 ఏళ్ల లోపు యువతీ యువకులు పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు.

కనులపండువగా కోటి దీపోత్సవం



బద్వేలు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వల్లెలవారిపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కార్తీక మాసం శనివారం సందర్భంగా ఆలయ ప్రాంగణలో కనుల పండువగా కోటీ దీపోత్సవం నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, అనంతరం కోటి దీపోత్సవం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అల్పాహార ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆగని ఆక్రమణల పర్వం

మైసూరివారిపల్లెలో వంకపోరంబోకు స్థలాన్ని ఆక్రమిస్తున్న వైనం ● రూ. కోట్లు విలువైన భూములు కాజేస్తున్న వైనం

17 ఎకరాల్లో మిగిలింది 4 ఎకరాలు! ● ఖద్దరుబాబుల అండతో యధేచ్ఛగా సాగుతున్న తంతు

రైల్వేకోడూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మైసూరివారిపల్లె పంచాయతీలో ఉన్న వంకపోరంబోకు భూమిని కొందరు ఆక్రమిస్తున్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి సదరు భూమిని పరిశీలించింది. అక్కడ ఆక్రమణలు కోకొల్లుగా బయటపడుతున్నాయి. రూ. కోట్లు విలువైన భూమిని ఆక్రమిస్తున్నారు. ఖద్దరు బాబుల అండతో ఆక్రమణలు దర్జాగా చేస్తున్నారు. సర్వే నెంబరు 2085లో 17.54 ఎకరాల భూమి ఉండేది. కాలక్రమేణ ఈ భూమి ఆక్రమణలు చేయడంతో కేవలం సుమారు 4 ఎకరాలు మాత్రమే మిగిలింది. మిగిలిన భూమిని కూడా ఆక్రమిస్తున్నారు. కాపాడిన వారే ఆక్రమించుకోండి అని చెప్పడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఓ మతానికి చెందిన వారికి సుమారు 4 ఎకరాలు కేటాయించారు. ఇది పోను మిగిలిన భూమి కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఈ భూమికి పక్కనే ప్రధానదారికి ముందు భాగంలో సుమారు ఐదెకరాల భూమిలో ఓ సోప్ పరిశ్రమ ఉండేది. సోప్ పరిశ్రమ మూతపడింది. తర్వాత ఓ నాయకుడు ఆ స్థలాన్ని తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత సోప్ పరిశ్రమ భవనాలను కూల్చి భూమిని చదును చేశారు. ఈ భూమి వెనుక భాగంలోనే వంకపోరంబోకు భూమి ఉంది. ఈ భూమిపై వైసీపీ ప్రభుత్వంలో అనేకులు కన్నేశారు. అయితే జనసేన కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసుల అండతో ఆక్రమణల పర్వం చేయాలని చూశారు. మైసూరివారిపల్లె గ్రామస్తులు చాలా సార్లు అడ్డుకున్నారు. ఖద్దరు బాబుల అండతోనే ఆక్రమణలు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ తంతు కూటమి ప్రభుత్వం వచ్చినాటి నుంచి మొదలు పెట్టడం, అధికారం మనదే కదా అని ఆక్రమణలు చేయడం కొసమెరుపు.



వంకపోరంబోకు భూమిలో కంచె వేసిన ఆక్రమణదారులు

ఉన్నతాధికారులకు నివేదిక

ఆక్రమణలపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్ తెలిపారు. మైసూరివారిపల్లె వంకపోరంబోకు స్థలంలో ఎవరు ఆక్రమణలు చేశారు, ఎంత వరకు జరిగాయి తదితర అంశాల పైన సర్వే చేయిస్తామని ఆయన వివరించారు.

ప్రభుత్వ పక్కాగృహంలో ఎర్రచందనం దుంగలు

ముద్దనూరు నవంబరు23(ఆంధ్రజ్యోతి): కొండప్రాంతంలో లబ్ధిదారులకు కేటాయించిన ప్రభుత్వ పక్కాగృహంలో నిల్వ చేసిన ఎర్రచందనం దుంగలను శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి టాస్క్‌ఫోర్సు అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌ఆర్ఓ అశోక్‌కుమార్ యాదవ్ వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముద్దనూరు పాతవీధిలోనున్న మల్లేశ్వరికి చెందిన నిర్మాణంలో నున్న ప్రభుత్వ పక్కాగృహంలో 32 ఎర్రచందనం దుంగలు నిల్వ చేసి ఉన్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు అధికారులు వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఇక్కడ దుంగలు ఉన్నట్లు తెలిసింది. దీంతో సీక్రెట్ ఆపరేషన్‌లో భాగంగా టాస్క్‌ఫోర్సు అధికారులు తెల్లవారుజామున దాడి చేసి స్వాధీనం చేసుకుని, దుంగలను తిరుపతికి తరలించారు. కేసును ముద్దనూరు అటవీ రేంజ్‌కి బదిలీ చేస్తారని తెలిపారు.

ఆర్ట్‌క్యాంపు మెంటార్‌గా మృత్యుంజయరావు



కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముంబైలోని ప్రతిష్ఠాత్మకమైన కోఫియో క్యామ్‌లిన్ ఆర్ట్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న దక్షిణ భారతదేశ పెయింటింగ్ క్యాంపునకు తెలుగు రాష్ట్రాల తరఫున మెంటార్‌గా వైవీయూ లలిత కళల విభాగం అధిపతి డాక్టర్ మృత్యుంజయరావు ఎంపికయ్యారు. ఈ మేరకు క్యామ్‌లిన్ ఫౌండేషన్ నుంచి ఆయనకు సమాచారం అందింది. ఈ నెల 25 నుంచి 30 వరకు కర్ణాటక రాష్ట్రం హంపిలో ఉన్న హంపీ యూనివర్శిటీ క్యాంపస్‌లో ఈ శిబిరం జరగనుంది. దక్షిణ భారతదేశంలోని ఫైన్‌ఆర్ట్స్ కాలేజీల నుంచి ఎంపిక చేయబడిన దాదాపు 80మంది యువ చిత్రకారులు పాల్గొననున్నారు.

రెవెన్యూ అనుమతులతో మట్టి తవ్వుకోవాలి



ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వుతున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల అనుమతులతో మట్టితోలకాలు జరగాలని తహసీల్దా రు దామోదరరెడ్డి తెలిపారు. శనివారం బ్రహ్మంగారిమఠం తోట్లపల్లె సమీప కొండ ప్రాంతంలో కొందరు అనుమతులు లేకుండా మట్టిని తోలుకుంటున్నారన్న విషయం తమ దృష్టికి రావడంతో రెవెన్యూ అధికారులు మట్టి తవ్వకాల స్థలానికి వెళ్లి పనులను నిలిపివేశారు. రాబోయే రోజుల్లో మండలంలో ఎక్కడా అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలను చేపట్టరాదని తహసీల్దారు తెలిపారు.

కామ్రేడ్ లింగమూర్తి సంస్మరణసభ నేడు

కడప నాగరాజుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూర్జహాన్ కల్యాణ మండపంలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేనత కామ్రేడ్ లింగమూర్తి సంస్మరణ సభను నిర్వహించనున్నామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పులివెందుల తాలుకా లింగా ల వాసి లింగమూర్తి విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులయ్యారని, రైతుసంఘాల తొలితరం నేతలైన గజ్జల మల్లారెడ్డి, తోట వెంకటరెడ్డి, కేవీ నాగిరెడ్డి, ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి శివరామిరెడ్డితో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. 60 ఏళ్ల ఎర్రజెండా నీడలో పనిచేసిన కామ్రేడ్ లింగమూర్తిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. ఈ సభకు వివి ధ పార్టీల ప్రజాప్రతినిధులు, కమ్యూనిస్టు నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజర వుతున్నారని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

జీవశాస్త్ర అధ్యాపకులకు ఒక రోజు శిక్షణ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవశాస్త్ర అధ్యాపకులకు కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో 26న ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ వై.మీనాక్షి పేర్కొన్నారు. జంతు శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో బీటీసీ శార్ప్‌స్టేటస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞతను పెంపొందించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అట్లూరు, బద్వేలు, సీకేదిన్నె, చెన్నూరు, గోపవరం, కమలాపురం, ఖాజీ పేట, సిద్దవటం, వల్లూరు, ఒంటిమిట్ట మండలాల్లోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆమె శనివారం ఒక ప్రకటనలో కోరారు.

చోరీ కేసులో 8 మంది అరెస్టు

కడప క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం ఎరువుల గోడౌన్‌లో ఎరువులు, రసాయన మందులు చోరీ చేసిన 8 మందిని అరెస్టు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కడపకు చెందిన ఉపేంద్ర, దిలీప్, రాజశేఖర్, సాయి, రాజేశ్, నరసింహ, సతీష్, చైతన్య ఈ నెల 20న రాత్రి గోడౌన్ తాళాలు పగలగొట్టి అందులో ఉన్న ఎరువులు సంబంధిత రసాయనిక మందులు చోరీ చేసినట్లు తెలిపారు. గోడౌన్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ సీతారామిరెడ్డి ఆదేశాలపై శనివారం నిందితులను అరెస్టు చేసి లక్ష రూపాయ లు విలువైన ఎరువులు, రసాయన మందులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కుమార్తె కనిపించలేదంటూ ఫిర్యాదు



చెన్నూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్నమాచుపల్లెకు చెందిన మారెళ్ల పూజ (16) 22వతేదీ శుక్రవారం నుంచి కనిపించలేదంటూ బాలిక తండ్రి మారెళ్ల రాజా శనివారం చెన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కూతురు ను రెండురోజుల కిందట మందలించడంతో ఆమె ఇంట్లో చెప్పకుండా శుక్రవారం మధ్యాహ్నం వెళ్లిపోయింది. చుట్టుపక్కల బంధువుల వద్ద విచారించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలి : ఆర్డీఓ

బద్వేలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని ఆర్డీఓ చంద్రమోహన్ పేర్కొన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో బద్వేలు, గోపవరం తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపాలిటీ లోని పురపాలక సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు రెవెన్యూ డివిజన్‌లో భూముల అన్యాక్రాంతం అధికమైందని వీటికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఉందని సూచించారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంలో ప్రభుత్వ సిబ్బంది పాత్ర ఉన్నట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో భూములు, చెరువులు, కుంటలు, పోరంబోకు, హౌసింగ్ లే అవుట్ స్థలాల అడ్డుకట్టకు ప్రతి అధికారి నిబద్ధతతో కృషిచేయాలన్నారు. ఈ ఆక్రమణలు రోడ్డు మధ్య, ముందుకు రేకులు వేయడం లాంటి ఆక్రమణలు అధికమవుతున్నాయని అలాంటి వాటిని గుర్తించి చట్టపర చర్యలు తీసుకోవాలని సూచించారు.

విజిలెన్స్ తనిఖీ



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎఫ్‌ఆర్వో మురళీక్రిష్ణ,

కడప క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుంత బజారులోని ఆరోగ్య రక్ష ఆయుర్వేద మందులషాపుపై శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేపట్టారు. వైద్య అర్హతలు లేకుండా పేషంట్లకు ప్రభావతి ఆయుర్వేద మందులను ఇస్తున్నట్లు గుర్తించామని అనుమతులు లేకుండా తైలాలు తయారు చేసి స్టిక్కర్లు అతికించిన వాటిని సీజ్ చేశారు. ఎఫ్‌ఆర్వో మురళీక్రిష్ణ, మెడికల్ ఆఫీసరు రిమ్స్ డాక్టర్ ఎస్.మురళీబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నీ నేడు

కడప స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంటర్‌నేషనల్ ఫం క్షన్ హాలులో ఆదివారం రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనీస్ దర్బారీ తెలిపారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులందరికీ ఉచిత భోజన వసతి, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

మహిళ అదృశ్యం

కడప క్రైం, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): కడప నగరం సరోజినీనగర్ మహిళ అదృశ్యమైనట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఆయన వివరాల మేరకు సరోజినీనగర్‌కు చెందిన మేరీ సుజాత నెల 13న ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. బంధువు లు ఇళ్లల్లో విచారించగా ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.



పెద్దమండ్యం-పాపేపల్లి సింగిల్ రోడ్డు

డబుల్ రోడ్లు ఎప్పుడో..?

●సింగిల్‌కే పరిమితమైన పెద్దమండ్యం ప్రధాన రహదారులు ● ఇబ్బందుల్లో వాహనదారులు ● పట్టించుకోని అధికారులు

పెద్దమండ్యం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఎందుకో మరి పెద్దమండ్యం మండలం సింగిల్ రోడ్లకే పరిమితమవుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన రోడ్ల అభివృద్ధిని పట్టించుకోలేదని పలువురు వాపోతున్నారు. గతంలో వేసిన సింగల్ తారురోడ్లే దర్శనమిస్తున్నాయి.

మండల పరిధిలోని పెద్దమండ్యం- గాలివీడు, పెద్దమండ్యం- చిన్నమండ్యం, పెద్దమండ్యం- తంబళ్లపల్లి సింగల్ రోడ్లు ఇంత వరకు డబుల్ రోడ్లకు నోచుకోలేదు. కొత్తగా అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంగా ఏర్పడి నప్పటి నుంచి ఈ మార్గంలో వాహనాల రద్దీ పెరిగింది. ప్రస్తుతం డబుల్ రోడ్ల నిర్మాణానికి అవశ్యకత నెలకొంది. అన్నమయ్య జిల్లా జిల్లా రాయచోటికి వెళ్లడానికి తంబళ్లపల్లి, ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట మండలాల అధికారులు, ప్రజలు ఈ మార్గమే అనుకూలం. కానీ పెద్దమండ్యం మండల పరిధిలో రోడ్ల దుస్థితిలో ఉండడంతో ప్రయాసపడి ఇతర మార్గాలలో జిల్లా కేంద్రం రాయచోటికి వెలుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దమండ్యం మండల పరిధిలోని సింగిల్ తారురోడ్లపై ఎదురెదురుగా కాని ఒకే సారి రెండు వాహనాలు వచ్చినా ఒకటి రోడ్డుపైన మరొకటి రోడ్డు పక్కన వెళ్లాల్సిరావడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ రహదారులపై కొన్ని చోట్ల ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇందులో మండల పరిధిలోని గాలివీడు రోడ్డు లో సుమారు 7మంది మృత్యువాత పడగా తంబళ్లపల్లి రోడ్డు మార్గంలో సుమారు 6మంది చిన్నమండ్యం మార్గంలో నలుగురుమృతి చెందారు. వాహనాల్లో ఎదురుఎదురుగా వైతొలుగుతూ కొందరు, మలుపుల్లో అదుపు తప్పి మరికొందరు రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు. మండలంలో దుస్థితిలో ఉన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులకే పరిమితం చేస్తున్నారు. పెద్దమండ్యం పరిధిలోని తంబళ్లపల్లి రోడ్డు చెరువుకిందపల్లి సమీపంలో నల్లగట్టు వద్ద తారురోడ్డు మట్టిరోడుగా మారింది. పెద్దమండ్యం-గాలివీడు రోడ్డు పాపేపల్లి మిట్ట వద్ద తారురోడ్డు వర్షపు ధాటికి రోడ్డు ఇరువైపులు కోతకు గురయ్యాయి. కుప్పాలకుంట చెరువుకట్టపై రోడ్డు కుదించుకుపోయి గుంతలమయంగా మారాయి. మరికొన్ని చోట్ల రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఉండడంతో వాహనదారులు ఎప్పుడు ఏంజరుగుతుందోనని భయపడుతున్నారు. ఈ రోడ్డు పై ప్రయాణం రాత్రి, పగలు తేడా లేకుండా వాహనదారు లు జాగ్రతగా వెళ్లాల్సి ఉంది. చిన్నమండ్యం రోడ్డు లో కూడ గుంతలు అధికంగా ఉన్నాయి. మండల పరిధిలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడిన బాధిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో వీధిన పడ్డాయి. ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టి రోడ్డు ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



చుట్టూ కంపచెట్లతో నిండిన పెద్దమండ్యం-కుప్పాలకుంట రోడ్డు

డబుల్ రోడ్లు మంజూరు చేయాలి



పెద్దమండ్యం మండల పరిధిలో సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లగా విస్తరణ చేసి అభివృద్ధి చేపట్టాలి. అన్నమయ్య జిల్లా రాయచోటికి వెళ్లాలంటే ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. డబుల్ తారురోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలి.

-మేకల చలపతి, బీసీసంక్షేమ అధ్యక్షుడు, పెద్దమండ్యం

డబుల్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపాం

తంబళ్లపల్లి నియోజకవర్గంలో తారురోడ్లకు అవసరమైన చోట్ల డబుల్ రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే ప్రయాణికుల సౌకర్యార్థం డబుల్ రోడ్లు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

- బోరయ్య, ఆర్అండ్‌బీ ఏఈ, తంబళ్లపల్లి

కూటమి నేతలతో కలుపుకుని టౌన్‌బ్యాంకు పాలకవర్గం

● అందరికి ప్రాధాన్యత ఇస్తాం ●ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



టౌన్‌బ్యాంకు డైరెక్టర్ అభ్యర్థులతో కలసి విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులకు ప్రాధాన్యత ఇస్తూ మదనపల్లె టౌన్‌బ్యాంకు పాలకవర్గం డైరెక్టర్ పోస్టులకు అవకాశం కల్పించామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూచనలతో మదనపల్లె అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ప్రస్తుతం టౌన్‌బ్యాంకు ఎన్నికలు ఏకగ్రీవం అవుతున్నాయని, ఇందులో జనసేన తరపున మహర్షిభాస్కర్, బీజేపీ నుంచి ఆకుల కృష్ణమూర్తికి డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చామన్నారు. దీంతో పాటు అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారిని, త్వరలో అన్ని రకాల పదవులను కేటాయిస్తామన్నారు. టౌన్‌బ్యాంకు చైర్మన్ అభ్యర్థి నాదెళ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ కొందరు ఏమి లేకుండానే ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తూ, ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. టౌన్‌బ్యాంకు సేవలు మరింత విస్తృతం చేసేందుకు పీలేరు, పలమనేరులో కూడా బ్రాంచిలు ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యేతో కలసి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో టౌన్‌బ్యాంకు డైరెక్టర్ అభ్యర్థులు మహర్షి భాస్కర్, ఎ.కృష్ణమూర్తి, నాదెళ్ల శివన్న, ముక్తియార్‌ఖాన్, ఆర్.సోమశేఖర్, శ్రీరామ రవికాంత్, పసుపు రవి, దేవేంద్ర, సర్దార్, ఆర్.భాస్కర్, నిరంజన్, టీడీపీ నాయకులు షంషీర్, నవీన్, ఫణికర్‌రెడ్డి, వేణుగోపాల్, చిన్నమహేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరవనం పనులను వేగవంతం చేయండి



మదనపల్లె నగరవనం పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో జగన్నాథసింగ్

మదనపల్లె టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ శివారు పుంగనూరురోడ్డు పక్కన ఏర్పాటు చేస్తున్న నగరవనం పనులను వేగవంతం చేయాలని డీఎఫ్‌వో జగన్నాథసింగ్ సూచించారు. శనివారం సాయంత్రం నగరవనాన్ని డీఎఫ్‌వో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరవనంలో వాకింగ్ ట్రాక్ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధుల నుంచి పనులు చేపట్టాలన్నారు. కాగా నిమ్మనపల్లె మండలంలోని అడవుల్లో చిరుత సంచారం విషయంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, అడవుల్లో పశువుల కాపర్లు, ప్రజలు తిరగకూడదన్నారు. అటవీశివారు గ్రామాల్లో ఇప్పటికే దండోరా వేయిస్తున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో జయప్రసాద రాజు, డీఆర్‌వో మదనమోహన్, ఎఫ్‌బీవోలు త్యాగరాజు, దీప పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కళ్యాణ్

కురబలకోట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కళ్యాణ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో బిల్డింగ్ ఏ సక్సెస్ ఫుల్ కెరియర్ యూజ్ యాన్ ఎంట్రప్రెన్యూర్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సహాయసహకారాలు అందిస్తున్నాయన్నారు. విద్యార్థులు నూతన ఆలోచనలతో వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంతో పాటుగా ఆ దిశగా అడుగులు ముందుకేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కల్పనా, విభాగాధిపతి నవీన్‌కుమార్, కో ఆర్డినేటర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు వేయడానికి పూజ చేస్తున్న విజయ్‌కుమార్‌గౌడు

రామసముద్రం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ కొత్తూరు గ్రామంలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఎమ్మెల్యే వెంటనే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించారు. గతకొంత కాలంగా గ్రామస్థులు తాగునీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సుమారుగా ఈ గ్రామంలో 70కుటుంబాలు ఉన్నాయి. వారు మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడుకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఆయన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించినఎమ్మెల్యే మండల గ్రాంట్ కింద కొత్త బోరు మంజూరు చేశారు. శనివారం తాగునీటి కోసం కొత్త బోరు వేయడానికి మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఈశ్వర్, వేణుగోపాల్, రాజేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ



సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జనసేన ఇన్‌చార్జి సాయినాథ్

ములకలచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ చేకూరుతోందని తంబళ్లపల్లె జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ పేర్కొన్నారు. మండలంలోని కదిరినాథునికోట పంచాయతీ గొడ్డావులకోటలో శనివారం జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పల్లె పండగ కార్యక్రమం నిర్వహించి రోడ్లు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేంద్ర, నాయకులు సుదర్శన్, మల్లెల అనీల్, కామాక్షి అంజి, ఆవుల శంకర, ప్రభాకర, పవన్‌రెడ్డి, భరత్‌రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయాలి



కలకడలో మినీ గోకులం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

కలకడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకంలో చేపట్టే వివిధ పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన కలకడ, కేవీపల్లె మండలాల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కూలీకి జాబ్ కార్డులను ఇచ్చి పనులు కల్పించాలని తెలిపారు. బాటవారిపల్లె, కలకడ పంచాయతీలో జరుగుతున్న పశువుల తాగునీటి కుంట, మినీ గోకులాలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో చెన్నకేశవులు పాల్గొన్నారు.

గోకులాల నిర్మాణ పనులు వేగవంతం చేయండి



బూదలవారిపల్లెలో గోకులం నిర్మాణాన్ని తనిఖీ చేస్తున్న ఏపీడీ మధుబాబు

తంబళ్లపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తంబళ్లపల్లె మండలంలో చేపడుతున్న గోకులాల నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఏపీడీ మధుబాబు సూచించారు. శనివారం ఏపీడీ మండలంలోని బూదలవారిపల్లె, ఇట్నేనివారిపల్లెలో చేపడుతున్న గోకులాల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తంబళ్లపల్లె మండలానికి 49 గోకులాలు మంజూరైనట్లు తెలిపారు. వాటిని లబ్ధిదారులు త్వరగా ప్రారంభించి అత్యంత నాణ్యతతో నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. ఈ గోకులాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో ఆంజినప్ప, ఉపాధి ఇంజనీర్ రామన్న, ఫీల్డ్ అసిస్టెంట్లు రమేష్, శంకర, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ



మదనపల్లె అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవళం వీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం తాళ్లపాలక హరినారాయణ చార్యులు సహస్ర దీపాలంకరణ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో తాళ్లపాక హరినారాయణ చార్యులు సంకీర్తన ప్రవచనాలు చేశారు. వచ్చిన భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమణ, దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా సీతారాం



కురబలకోట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : జాతీయ కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎస్.సీతారాంను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు కె.మురళీ కృష్ణ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని అంగళ్లుకు చెందిన ఆయన బలిజ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పని చేశాడు. ఆయన చేసిన సేవలను గుర్తించి పదవిని అప్పగించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సీతారాం మాట్లాడుతూ బలిజల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అలాగే వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడంతో పాటుగా, వారికి అండగా ఉంటానన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన జాతీయ అధ్యక్షుడు కె.మురళీ కృష్ణ నాయుడుకు కృతజతలు తెలిపారు.

రేపు మడికయ్యల శివాలయంలో లక్ష బిల్వార్చన

మదనపల్లె అర్బన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పిలిగ్రామంలో వెలసిన యోగభోగేశ్వరస్వామి ఆలయంలో (మడికయ్యలశివాలయం)ఈ నెల 25న లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయప్రధాన అర్చకుడు విశ్వేశ్వరప్రసాద్ తెలిపారు. కార్తీక మాసంలో పవిత్రమైన నాలుగో సోమవారం స్వామవారికి రుద్రాభిషేకం, రుద్రహోమం, లక్ష బిల్వార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించనునన్నట్లు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం కేదారేశ్వరవ్రత నోములు జరుగుతాయని చెప్పారు.

పాఠశాలల్లో అపార్ ఐడీని వేగవంతం చేయండి



మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

నిమ్మనపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే అపార్ ఐడీని వేగవంతం చేయాలని ఎంపీ డీవో పరమేశ్వరెడ్డి పేర్కొన్నా రు. శనివారం మండలం లోని కస్తూరిబా, జడ్పీ హైస్కూళ్లను ఎంపీడీవో తని ఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు గుర్తింపు నిచ్చేందుకు అపార్ ఐడీలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. అలాగే కొన్ని పాఠశాలల్లో అపార్ ఐడీలు చేయడంలో వెనుకంజలో ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం కస్తూరిబా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అలాగే ఉర్దూ హైస్కూల్, నిమ్మనపల్లి జడ్పీ హైస్కూల్‌లో అపార్ ఐడీలు ఎంతవరకు వచ్చాయని ఆరాతీశారు. అలాగే ముష్టూరులోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎప్‌వో మునివెంకటమ్మ, సిబ్బంది గుర్రప్ప పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి సహకరించండి

ములకలచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆ పార్టీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్ద పాళ్యం మల్లికార్జున పేర్కొన్నారు. మండలంలోని సోంపల్లెలో శనివారం బీఎస్పీ మండల అధ్యక్షుడు మల్లప్ప అధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అభివృద్ధి చెందాలంటే బీఎస్పీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రమణప్ప, సిద్ధమళ్ళు, వెంకటరమన, చంద్ర పాల్గొన్నారు.

అంజుమన్ సంస్థ ఆస్తులు వక్ఫ్‌బోర్డు స్వాధీనం



అంజుమన్ సంస్థ ఆస్తులను వక్ఫ్‌బోర్డుకు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

మదనపల్లె అర్బన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణంలోని అంజుమన్ -ఏ-హమ్‌దర్ద్- ఇస్లాంకు చెందిన వక్ఫ్‌ఆస్తులను వక్ఫ్ బోర్డు ఏపీ స్టేట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఆదేశాల మేరకు వక్ఫ్‌బోర్డు అధీనంలోకి తీసుకున్నట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీమ్ అక్రమ్ తెలిపారు. 1962 గెజిట్ ప్రకారం పట్టణంలోని అంజుమన్ -ఏ-హమ్‌దర్ద్-ఇస్లాం సంస్థను వక్ఫ్‌బోర్డు ఆస్తులుగా గుర్తించారు. దీనికి సం బంధించిన లావాదేవీల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వక్ఫ్‌బోర్డు ద్వారా నోటీసులు జారీ చేశామన్నారు. దీనిపై అంజుమన్-ఏ-హమ్‌దర్ద్- ఇస్లాం సంస్థ కమిటీ సభ్యుల నుంచి స్పందన లేకపోవడంతో శనివారం సంస్థకు చెందిన ఆస్తులను పోలీసు, రెవెన్యూ అధికారుల, స్థానిక ముస్లింపెద్దల సమక్షంలో వక్ఫ్ బోర్డు ఆధీనంలోకి తీసుకున్నారు. ఇకపై ఈ సంస్థ వ్యవహారాలన్నీ అన్న మయ్య జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారులతో సంప్రదించాలని కోరారు.

సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా



సభ్యత్వ నమోదు చేపట్టిన నాయకులు

ములకలచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో నాయకులు, కార్యకర్తలకు భరోసా ఉంటుందని మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ పేర్కొన్నారు. ములకలచెరువులో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కార్యకర్తల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు పెద్దపీట వేస్తున్నారన్నారు. స్థానికులు నీలకంఠారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధర్మపథంలో తృతీయవార్షికోత్సవాలు

వాల్మీకిపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ పడమర పొలిమేరలోని ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి దేవాలయం తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. 24న సాయంత్రం గజవాహనంపై సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవం, 25న సాయంత్రం యాలి వాహన సేవ , 26న సాయంత్రం వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, పురుష మృగ వాహనంపై స్వామి ఉత్సవం జరగనున్నాయన్నారు.

కాంగ్రెస్ విజయంపై ఎన్ఎస్‌యూఐ సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న ఎన్ఎస్‌యూఐ శ్రేణులు

పీలేరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాష్ట్రంతోపాటు వయనాడ్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై శనివారం పీలేరులోని ఎన్ఎస్‌యూఐ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక అజంతా టాకీసు మిట్ట మీద బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ మాట్లాడుతూ జార్ఖండ్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం, వయనాడ్‌లో అగ్రనేత ప్రియాంక గాంధీ 4 లక్షల పైచిలుకు మెజారిటీతో విజయం సాధించడం హర్షణీయమన్నా రు. ఈ రెండు విజయాలతో దేశ ప్రజలు ఇప్పటికీ కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారన్న సత్యం నిరూపితమైందన్నారు. రాహుల్ సారథ్యంలో కేంద్రంలో కాంగ్రెస్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నేతలు యూసుఫ్, సాయిసంపత్, న్యాయవాది చాన్ బాషా, లోకేశ్, శివ, రూపేష్ పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి బాబా జయంతి

●నిరుపేదలకు అన్నదానం ●ఆస్పత్రిలో పండ్లు, దుస్తులు పంపిణీ



ప్రభుత్వాస్పత్రిలో పండ్లు రొట్టెలు పంపిణీ చేస్తున్న సేవా సమితి మహిళా సభ్యులు

వాల్మీకిపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకలను శనివారం వాల్మీకిపురంలో ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకం, అర్చన, విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు జరిగాయి. అంతకు ముందు పట్టణ పురవీధులలో సత్యసాయిబాబా నగర సంకీర్తన సాగింది. ఈ సందర్భంగా నిరుపేదలకు అన్న, ప్రసాద వితరణ, స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బాలింతలకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయంలో సత్యసాయిబాబా సంకీర్తనలు జరిగాయి. ఈకార్యక్రమాలలో సత్యసాయిబాబా సేవా సమితి సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట సాయిమందిరంలో ఘనంగా వేడుకలు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఆలయ కమిటీ సభ్యులు

బి.కొత్తకోట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా వారి 99వ జయంతి వేడుకలు బి.కొత్తకోట లో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సత్యసాయినగర్‌లో ఉన్న బాబా మందిరంలో ఉదయాత్పూర్వం 5 గంటలకు ఓంకారం, సుప్రభాత సేవల అనంతరం సాయిబాబా విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం మహానారాయణసేవ, వస్త్రదానం చేశారు. ఆలయంలో ఇటీవల నిర్వహించిన వ్యారచన పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. భగవాన్‌సత్యసాయిబాబా గురించి వక్తలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ శేఖర్‌బాబు,షాజహాన్‌బాషా, డా.వీవీ రెడ్డి, మాజీ సర్పంచ్ కుడుం శ్రీనివాసులు, రాఘవన్‌స్కూల్ హెచ్‌యం రఘురాం లతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టరేట్ డీఏవో బదిలీ



బదిలీపై వెళుతున్న డీఏవో పద్మావతికి వీడ్కోలు పలుకుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఉద్యోగులు

మదనపల్లె టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టరేట్ పరిపాలన అధికారి(డీఏవో)గా పని చేస్తున్న పద్మావతి బదిలీ అయ్యారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ డీఏవోగా పద్మావతి చక్కగా సేవలందించారన్నారు. బదిలీపై కర్నూల్ కలెక్టరేట్‌కు వెళుతున్న పద్మావతికి శాలువ కప్పి సన్మానించి, వీడ్కోలు పలికారు. కాగా సబ్‌కలెక్టరేట్ ఎన్నికల డీటీ రాఘవేంద్ర డీఏవో పోస్టుకు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులు ఇమ్రాన్, సాయి, కుమారి, శ్రీనివాసులు, సోహైల్, జయప్రకాష్ పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు

మదనపల్లె టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ బట్టీలపై ఎక్సైజ్‌శాఖ, ఈఎస్‌టీఎఫ్ పోలీసు లు సంయుక్త దాడులు నిర్వహించి శనివారం ఎక్సైజ్ సీఐ భీమలింగ ఈఎస్‌టీఎఫ్ సీఐ ఎల్లయ్య ఆధ్వర్యంలో నారమాకులతాండాలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బి.పద్మ ఇంట్లో 5లీటర్ల సారా సీజ్ చేయడంతో పాటు సారా తయారీకి ఉంచిన 200 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. దీంతో పాటు బి.సరస్వతికి చెందిన పాత ఇంట్లో 5లీటర్ల నాటుసారా సీజ్ చేసి, 250 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

15 లోగా గోకులం షెడ్లు పూర్తి చేయాలి

పెద్దమండ్యం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్ల నిర్మాణాలను డిసెంబరు 15వ తేదీ లోపు పూర్తి చేయాలని ఉపాధి ఏపీడీ మధు బాబు పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలో జరుగుతున్న గోకులం షెడ్ల నిర్మాణం పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మం డలంలో 50 గోకులం షెడ్లు మంజూరైనట్లు తెలిపారు. మూడు రకాల కలిగిన షెడ్లు మంజూరైనట్లు తెలిపారు. 6 ఆవులు కలిగిన రైతులకు రూ. 2లక్షల 30వేలు, 4 ఆవుల ఉన్న రైతులకు రూ. 1లక్ష 80 వేలు, 2 ఆవులకు షెడ్డు విలువ రూ. 1లక్ష .30 వేలు స్థాయిని బట్టి ప్రభుత్వ నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ నెల 30 వతేదీ లోపు షెడ్లు నిర్మాణం ప్రారంభించక పోతే మంజూరైన షెడ్లను రద్దు చేసి అర్హులైన ఇతర రైతులకు ఆ షెడ్లను కేటాయిస్తామన్నారు. ఉపాధి ఏపీవో మురళి, సిబ్బంది పాల్గొన్నారు.